**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 97003 70499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక








చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | మంగళవారం 03-06-2025 | సంపుటి : 11 | సంచిక : 129 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## పర్యావరణం పరంగా కొల్లేరు కీలకం

**కాంటూరు పరిధి వల్ల 3 లక్షల మందికి సమస్యలు**
**మానవీయ కోణంలో కొల్లేరు సమస్యల పరిష్కారం**
**ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగించాల్సి ఉంది**
**పర్యావరణంతోపాటు- ప్రజలకూ న్యాయం జరిగేలా కార్యాచరణ**
**కొల్లేరుపై సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు**

అమరావతి,జూన్2 పర్యావరణం పరంగా కీలకమైన కొల్లేరు సరస్సును తప్పక రక్షించుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. కొల్లేరు వాసుల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాల్సి ఉందన్నారు. కొల్లేరుపై కేంద్ర సంస్థల ఆదేశాలు, పర్యావరణం, కాంటూరు అంశాలపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. కాంటూరు పరిధి వల్ల 3 లక్షల మంది ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కొల్లేరు కాలుష్యం కాకుండా డ్రైన్ వాటర్‌కు ట్రీట్‌మెంట్ జరగాలన్నారు. కొల్లేరు నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగించాల్సి ఉందన్నారు. కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య ఉన్నందున ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రతిపాదనలను సీఈసీ, సుప్రీంకోర్టు ముందుంచి వారిని ఒప్పించాలి. పర్యావరణంతోపాటు- ప్రజలకూ న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలి. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణ, కాంటూరు అంశాలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్షించారు. కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారు... కొల్లేరు కాంటూరు పరిధి అంశంలో చాలా కాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్య పరిష్కారం కోసం 2014 నుంచి 2019 మధ్య నాటి తెలుగుదేశం ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా 2018లో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు 20 వేల ఎకరాల జరాయితీ, డీ పట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి కొత్త సరిహద్దులను నిర్ధారించాలని చెప్పింది. ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి సిఫారసు కూడా చేసింది. అయితే దీనిపై కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటు-వంటి ప్రయత్నమూ చేయలేదు. కొల్లేరు సమస్య పరిష్కారంపై పట్టు-దలగా ఉన్న కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ ప్రాంతం ఎమ్మెల్యేలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...'కొల్లేరు కాలుష్య కాసారం కాకుండా చూడాలి. కొల్లేరులోకి వెళ్తున్న డ్రైన్ వాటర్‌కు ట్రీట్‌మెంట్ జరగాలి. విచ్చల విడిగా డ్రైన్లు వదిలేసి కొల్లేరును కాలుష్యమయం చేసే ప్రక్రియకు బ్రేక్ పడాలి. డ్రైన్‌లో పూడికలు తొలగించాలి....నీరు సులువుగా వెళ్లే అవకాశం కల్పించాలి. కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకువెళ్లే ఉప్పుటేరు అక్రమణలను తొలగించాలి. ఉప్పుటేరు పూడిక తీసి, ఆక్రమణలు తొలగించి నీరు సముద్రంలోకి వెళ్లేలా చేయాలి. అవుట్ లెట్లు- పూర్తిగా క్లియర్ చేయాలి. ఈ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి పనులు



ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కొల్లేరు రైతుల సమస్యలపై మాట్లాడుతూ.... 'కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య నేపథ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సీఈసీని, సుప్రీంకోర్టు ముందు ఉంచి వారిని ఒప్పించాలి. పక్షులు, పర్యావరణంతో పాటు- ప్రజలకు కూడా న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలని సీఎం చంద్రబాబు అన్నారు. సమీక్షకు చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో పాటు- అధికారులు, డిప్యూటీ- స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు.

## బనకచర్ల ప్రాజెక్ట్‌పై న్యూఢిల్లీలో ముగిసిన సమావేశం.. కీలక అంశాలు ప్రస్తావన

న్యూఢిల్లీ, జూన్ 02: ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై ఉన్నతాధికారుల సమావేశం ముగిసింది. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఏపీ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి పియూష్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్ట్‌పై కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు లేవనెత్తిన పలు సందేహాలకు ఏపీ అధికారులు సమాధానాలు ఇచ్చారు.



బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ వల్ల రైతులకు అత్యధిక మేలు జరుగుతుందని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అలాగే పలు ప్రాంతాలకు సాగు, తాగు నీరు సైతం అందించవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఈ బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు అత్యధిక లబ్ధి చేకూరనుంది. వీటితోపాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సైతం నీటి సమస్య తీరనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దాదాపు 80 లక్షల మంది ప్రజలకు ఈ ప్రాజెక్ట్ వల్ల ఉపయోగం కలగనుందని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఈ బనకచర్ల ప్రాజెక్ట్ ద్వారా గోదావరి వరదనీటిని రాయలసీమ బేసిన్‌కు తరలించడం వల్ల కలిగే లాభాలను కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఏపీ అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభ్యంతరాల గురించి కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు ఏపీ అధికారులు వివరించినట్లు తెలుస్తోంది.

## వేల ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించిన రైతులు

అమరావతి, జూన్ 02: రాజధాని అమరావతిలో ఎయిర్‌పోర్ట్ సహా స్మార్ట్ ఇండస్ట్రీస్, అంతర్జాతీయ క్రీడా నగరం కోసం 34 వేల ఎకరాల భూ సమీకరణ సరిపోదని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. ప్రజాభిప్రాయంతోనే భూ సమీకరణ నిర్ణయం తీసుకోవాలనుకున్నామని పేర్కొన్నారు. పెదకూరపాడు పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపామన్నారు. 24 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు అంగీకారం తెలిపారని ఆయన వివరించారు. ఇప్పటి వరకు భూ సమీకరణ నిబంధనలు 217



చ.కి.మీ వరకే ఉందని చెప్పారు.సోమవారం అమరావతిలో 48వ సీఆర్‌డీఏ సమావేశం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం అనంతరం మంత్రి పి. నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ.. భూ సమీకరణ నిబంధనల పరిధి పెంచేందుకు సీఆర్డీఏ నిర్ణయం తీసుకుందని తెలిపారు. కొత్తగా సేకరించే 40 వేల ఎకరాలు అభివృద్ధి చేయాలంటే.. నిధుల సమీకరణకు మరో 2, 3 వేల ఎకరాలు అవసరమవుతుందని చెప్పారు. ఎకనామిక్ యాక్టివిటీ పెరగాలంటే అధిక ల్యాండ్ అవసరమవుతుందన్నారు. జగన్ అసెంబ్లీలో తొలుత 30 వేల ఎకరాలు కావాలని.. ఇటీవల 500 ఎకరాలు చాలని అన్నారని ఈ సందర్భంగా మంత్రి నారాయణ గుర్తు చేశారు. అయితే వైఎస్ జగన్ వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు

## అరాచక శక్తులను కాపాడటానికి రాజకీయాన్ని వాడుకోవద్దు

విజయవాడ, జూన్ 02: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం తెనాలిలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ పర్యటనపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. సోమవారం విజయవాడలో మంత్రి నాదెండ్ల మనోహర్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెనాలిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని పర్యటన చేయాలని వైఎస్ జగన్‌కు ఆయన సూచించారు. జగన్ ప్రభుత్వ హయాంలో తెనాలిని గంజాయి అడ్డగా మార్చేశారని విమర్శించారు. దీంతో పోలీసులు సైతం మిమ్మల్ని ఆపలేరనే విధంగా గంజాయి బ్యాచ్ తయారైందన్నారు. గత



ంలో తన స్నేహితుడి కుమారుడిని సైతం అడ్డుకొని దాడి చేశారని ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. అయితే ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థి బహిరంగ సభలో ఐదు నిమిషాల్లోనే ఎన్నిక పూర్తయిపోతుందన్నారని.. ఈ గంజాయి బ్యాచ్‌ను చూసుకునే ఆయన అలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. లా అండ్ ఆర్డర్ అంటే ఈ బ్యాచ్‌కు భయం లేకుండా తయారయిందని చెప్పారు.ఎన్నికల పోలింగ్ రోజు సుధాకర్ అనే వ్యక్తిని మీ పార్టీకి చెందిన గంజాయి బ్యాచ్ దాడి చేయడం నిజం కాదా? అని వైఎస్ జగన్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ సూటిగా ప్రశ్నించారు. అరాచక శక్తులను కాపాడటానికి రాజకీయాన్ని వాడుకో వద్దంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌కు హితవు పలికారు. తెనాలి పర్యటనపై ఆలోచించుకోవాలని వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా ఆయన కీలక సూచన చేశారు. గత ఐదేళ్లలో ఈ బ్యాచ్ ఎంత మందిని ఇబ్బంది పెట్టారన్నారు. ఇక తెనాలిలోని ఐతా నగర్‌లో ఎంతో మంది తల్లులు భయభ్రాంతులకు గురయ్యారన్నారు.

## పోలీసులు రౌడీ షీటర్లను కొడితే తప్పేంటి ? తెనాలి ఘటనపై హోంమంత్రి కామెంట్స్..!

ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలిలో తాజాగా పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడికి దిగడం, అనంతరం వారిని పట్టుకుని రోడ్డుపైనే పోలీసులు లాఠీలతో అరికాళ్లపై కొట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ చర్యను పోలీసు వర్గాలు ఇప్పటికే సమర్ధించుకున్నాయి. పోలీసులపై గంజాయి బ్యాచ్ దాడి చేయడం వల్లే తాము వాళ్లను పట్టుకుని శిక్షించినట్లు చెప్పుకొస్తున్నారు. దీనిపై విమర్శలు వస్తున్న తరుణంలో ఇవాళ హోంమంత్రి వంగలపూడి అనిత దీనిపై స్పందించారు. తెనాలిలో రౌడీ షీటర్లపై పోలీసుల బహిరంగ దాడిపై హోంమంత్రి అనిత స్పందించారు. పోలీసులు ఇలా రౌడీ షీటర్లపై రోడ్డుపైనే దాడికి దిగిన ఘటనపై మీడియా ప్రశ్నకు సమాధానం ఇచ్చిన అనిత.. దీన్ని సమర్ధించుకున్నారు. పోలీసులు యాక్షన్ తీసుకోలేదంటారని, ఒక స్టెప్ ఫార్వాడ్ వేస్తే ఈ రకంగా విమర్శిస్తారని అనిత చెప్పుకొచ్చారు. పోలీసుల్ని కొంత పనిచేసుకోనివ్వాలని హోంమంత్రి తెలిపారు. ఒక్రీబనీ ' తెనాలిలో పోలీసులపై రౌడీ షీటర్స్ దాడికి ప్రయత్నించారని, పోలీసుల్ని కొట్టినందుకే వాళ్లు అలా చేసారని హోంమంత్రి అనిత తెలిపారు. వాళ్లందరూ రౌడీ షీటర్స్, గంజాయి బ్యాచ్ అని హోంమంత్రి వెల్లడించారు. దీంతో అనిత వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పోలీసుల్ని కొట్టిన వాళ్లను చట్టప్రకారం శిక్షించే అవకాశం ఉన్న ఇలా రోడ్డుపై వాళ్లను లాఠీలతో అందరూ చూస్తుండగా కొట్టడం, దాన్ని హోంమంత్రి సమర్ధించుకోవడం చర్చనీయాంశమవుతోంది. ఇలాంటి చర్యలను సమర్ధిస్తే పోలీసులు మరింత రెచ్చిపోతారన్న చర్చ జరుగుతోంది.


## బనకచర్ల ప్రాజెక్ట్‌పై న్యూఢిల్లీలో ముగిసిన సమావేశం.. కీలక అంశాలు ప్రస్తావన

న్యూఢిల్లీ, జూన్ 02: ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం - బనకచర్ల ప్రాజెక్టలపై ఉన్నతాధికారుల సమావేశం ముగిసింది. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఏపీ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి పియూష్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్ట్‌పై కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు లేవనెత్తిన పలు సందేహాలకు ఏపీ అధికారులు సమాధానాలు ఇచ్చారు.బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ వల్ల రైతులకు అత్యధిక మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది. అలాగే పలు ప్రాంతాలకు సాగు, తాగు నీరు సైతం అందించ వచ్చని ప్రభుత్వం చెబుతుంది. ఈ బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు అత్యధిక లబ్ధి చేకూరనుంది. వీటితో పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సైతం నీటి సమస్య తీరనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దాదాపు 80 లక్షల మంది ప్రజలకు ఈ ప్రాజెక్ట్ వల్ల ఉపయోగం కలగనుందని పేర్కొంటుంది. ఈ నేపథ్యంలో ఈ బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల గోదావరి వరద నీటిని రాయలసీమ బేసిన్‌కు తరలించడం వల్ల కలిగే లాభాలను కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఏపీ అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభ్యంతరాల గురించి కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు ఏపీ అధికారులు వివరించినట్లు తెలుస్తోంది.





## రసవత్తరంగా తిరువూరు ఛైర్మన్ ఎన్నిక

ఇంటర్నెట్ డెస్క్: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ పదవిని టిడిపి కైవసం చేసుకుంది. టిడిపి అభ్యర్థి కోలికపోగు నిర్మల 11 ఓట్లతో విజయం సాధించారు. పది మంది టీడీపీ కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఓటు హక్కును వినియోగించుకోవడంతో నిర్మల గెలిచారు. వైసీపీ అభ్యర్థి మోతుకు ప్రసాద్‌కు 9 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నగర ఛైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఒకటవ వార్డు కౌన్సిలర్ కె.నిర్మలకు ఎమ్మెల్యే ఓటు పాటు, 10 మంది కౌన్సిలర్లు మద్దతు పలికారు.తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్‌గా ఎన్నికైన నిర్మలకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంపీ చిన్ని.. వైసీపీ నాయకులు, కౌన్సిలర్లను వారి కుటుంబాలకు దూరం చేసి క్యాంపు రాజకీయాలు నడిపారన్నారు. టీడీపీ పార్టీగా తామెవ్వరం క్యాంపు రాజకీయాలు నడపలేదని.. టిడిపి కౌన్సిలర్లు స్వేచ్ఛగా తిరువూరులోనే వారి నివాసంలో కుటుంబ సభ్యులతోనే గడిపారని చిన్ని తెలిపారు.విజయవాడకు చెందిన వైసిపి గుండాలు తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా అలజడి సృష్టించేందుకు ప్రయత్నించారని.. తెలుగు తమ్ముళ్ల తిరుగుబాటుతో వెనుదిరిగారని చిన్ని అన్నారు. నాలుగేళ్లలో నగర పంచాయతీలో అభివృద్ధి జరగకుండా వైసిపి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని ఎంపీ విమర్శించారు. ఈరోజు నుంచే



తిరువూరు నగర పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికాయుతంగా, యుద్ధ ప్రాతిపదికన పనులు చేయడానికి చర్యలు మొదలు పెడతామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.తాగునీరు, నగరంలో పారిశుద్ధ్యం, రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరించే విధంగా ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో తిరువూరు నగర పంచాయతీని మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేస్తామని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నికకు సహకరించిన ఎన్డీఏ కూటమి నేతలకు, మీడియాకు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు ఎంపీ కేశినేని శివనాథ్.

# సంపాదకీయం

మంగళవారం 03-06-2025

## కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న ఒక సంచలనాత్మక నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అమెరికా రాయబార కార్యాలయాలు విద్యార్థి వీసాల జారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఈ నిర్ణయం, ముఖ్యంగా చైనీస్ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది, ఎందుకంటే వారు అమెరికాలో అత్యధిక సంఖ్యలో ఉన్నత విద్య కోసం వచ్చే అంతర్జాతీయ విద్యార్థులలో రెండవ అతిపెద్ద సమూహం.ట్రంప్ నిర్ణయం అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో వచ్చింది. ట్రంప్ పరిపాలన గతంలోనూ వీసా విధానాలను కఠినతరం చేసినప్పటికీ, ఈ సారి చైనీస్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం గమనార్హం. అమెరికా రాష్ట్ర కార్యదర్శి మార్కో రూబియో తన ట్వీట్‌లో, చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు ఉన్న విద్యార్థులు లేదా కీలక రంగాలలో చదువుతున్న వారి వీసాలను రద్దు చేయడం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కీలక రంగాలలో సాంకేతికత, ఇంజనీరింగ్, శాస్త్రీయ పరిశోధనలు ఉండవచ్చని భావిస్తున్నారు.అమెరికాకు తమ పిల్లల్ని పంపాలంటే తల్లిదండ్రులు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారు. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారాన్ని చేపట్టిన తర్వాత అక్కడి యూనివర్సిటీలపై, విదేశీ విద్యార్థులపై ఆంక్షలకు తెర లేపారు. అమెరికాకు తమ పిల్లల్ని పంపించి నిజంగానే మంచివిద్యను అందించాలనుకొనే తల్లిదండ్రులు ఉన్నారు.మన సమాజంలో, ఎంత ఖర్చయినా సరే పిల్లల్ని అమెరికా పంపి తమ స్టేటస్ పెంపుగా భావిస్తున్న తల్లిదండ్రులూ ఉన్నారు. ఆసియా దేశాల నుంచి 1960 దశకంలో అనేక విద్యావంతులు అమెరికాకు వెళ్లారు. మన దేశం నుంచి కూడా అమెరికాకు అప్పుడు అవ సరమైన శాస్త్రజ్ఞులు, ఇంజినీర్లు, డాక్టర్లు వలస వెళ్లారు. అక్కడ పీహెచ్‌డీలు పూర్తి చేసి తమ రంగాల్లో రాణించారు. మన దేశానికి ఎంతో పేరు తెచ్చిన వారు ఉన్నారు. ఇప్పుడు అమెరికన్ ఐటీ కంపెనీలకు సీఈఓలుగా మనవాళ్లు ఎదిగినట్టుగానే అప్పుడు వివిధ రంగాల్లో మనవాళ్లు ప్రఖ్యాతి గడించారు. విభిన్నమైన ఆలోచనలకు కేంద్ర బిందువుగా అమెరికా విశ్వవిద్యాలయాలు పేరు తెచ్చుకున్నాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక, వైజ్ఞానిక రంగాల్లో పలువురుమేధావులను అక్కడి యూనివర్సిటీలు అందించాయి. మన దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ ఎదుట అక్కడి విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న మన దేశ విద్యార్థులు కొందరు నిరసన తెలిపారు. భారత కాన్సులేట్ అధికారులకు ఇది కోపం తెప్పించింది. నిరసన తెలిపిన ఆ విద్యార్థుల పేర్లు ఇవ్వాల్సిందిగా యూనివర్సిటీని అడిగారు. అయితే, నిరసన తెలపడం వారి హక్కు, వారి పేర్లను ఇచ్చేది లేదని యూనివర్సిటీ స్పష్టం చేసింది. ఇది గత కాలం ముచ్చట. ఇప్పుడు ట్రంప్ సర్కారులో అలాంటి విద్యార్థుల వీసాలు రద్దు కావచ్చు.అమెరికాకు వలస వస్తున్న విద్యార్థులు వీసా పొందే సమయంలోనే ఇప్పుడు తమ 'కాండాక్టు సర్టిఫికెట్' ఇచ్చుకోవాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో వారి భావజాలాన్ని నిశితంగా పరిశీలించడం జరుగుతుంది. అమెరికా యూనివర్సిటీల్లోని మన దేశ విద్యార్థులు ఇప్పటికే తమ సోషల్ మీడియా ఖాతాలను తొలగించుకొని ఉంటారు. కొత్తగా అమెరికాకు వెళ్లాలనుకొనే విద్యార్థులు ఇక రాజకీయ నిరసన ప్రదర్శనల్లో పాల్గొని వున్నా, అక్కడ క్లాసులు ఎగ్గొట్టినా వీసాలకు ముప్పే. ట్రంప్ సర్కారు అనుసరిస్తున్న.ఈ ధోరణిని అక్కడి కోర్టులు తప్పు పడుతున్నా, ఇది మన దేశంలో పిల్లల్ని అమెరికాకు పంపించాలని కలలు గన్న తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తున్నది. అమెరికాలో డాలర్ డ్రీమ్స్ ఇక అంత సులభం కాదని విద్యార్థులూ కలత చెందుతున్నారు.ఎలాగోలా వీసా సంపాదించినా అమెరికాలో ఇక మన బతుకు దుర్భరమేనని సాధారణ అభిప్రాయం మన విద్యార్థుల్లో కలుగుతోంది. ఇప్పటి వరకు దాదాపు మూడున్నర లక్షల మంది విద్యార్థులు ప్రతి ఏటా మన దేశం నుంచి అమెరికాలో చదువుల కోసం వెళు తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో అక్కడి షరతులు, నిబంధనలను గమనిస్తే గాని అమెరికాలో భారతీయ విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది తేలుతుంది ట్రంప్ పరిపాలన చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు ఉన్న విద్యార్థులు అమెరికా యొక్క సున్నితమైన సాంకేతిక రహస్యాలను యాక్సెస్ చేయవచ్చనే ఆందోళనను వ్యక్తం చేసింది.అమెరికా?చైనా మధ్య కొనసాగుతున్న సుంకాల యుద్ధం ఈ నిర్ణయానికి ఒక కారణంగా ఉండవచ్చు. చైనా నుండి దిగుమతులపై అధిక సుంకాలు విధించడంతో పాటు, ఈ వీసా ఆంక్షలు చైనాపై ఒత్తిడి పెంచే వ్యూహంగా భావించబడుతోంది.ట్రంప్ పరిపాలన ఇమ్మిగ్రేషన్ విధానాలను కఠినతరం చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది.ఈ నిర్ణయం చైనీస్ విద్యార్థులతో పాటు, ఇతర దేశాల నుండి వచ్చే విద్యార్థులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా యొక్క విభిన్న సంస్కృతి మరియు అగ్రగామి విద్యా సంస్థలు అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షిస్తాయి. కానీ, ఈ కఠిన వీసా విధానాలు వారి కలలను నీరుగార్చే అవకాశం ఉంది. ఇది అమెరికా యొక్క విద్యా రంగంపై కూడా ఆర్థిక ప్రభావం చూపవచ్చు, ఎందుకంటే అంతర్జాతీయ విద్యార్థులు దేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిస్తారు.ఈ ఆంక్షల కారణంగా, చైనీస్ విద్యార్థులు కెనడా, యూరప్, ఆస్ట్రేలియా వంటి ఇతర దేశాల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ దేశాలు అంతర్జాతీయ విద్యార్థులను స్వాగతించే విధానాలను అమలు చేస్తున్నాయి. అయితే, అమెరికా యొక్క ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలు, పరిశోధనా అవకాశాలు ఇప్పటికీ చాలా మంది విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉన్నాయి.

# తలనొప్పిగా మారిన మేఘా వేమూరి

### పాలస్తీనాకు మద్దతు పలికిన తెలుగు అమ్మాయి

హైదరాబాద్, జూన్ 2,అమెరికా భారతీయ విద్యార్థులకు ఉన్నత విద్యకు ఒక ప్రధాన గమ్యస్థానంగా ఉంది. అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు, అధునాతన పరిశోధన సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు లక్షలాది భారతీయ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. 2024లో, 3 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు అమెరికాలో విద్యనభ్యసిస్తున్నారని అంచనా. అయితే, ఇటీవలి సంవత్సరాలలో, వీసా నిబంధనలు, రాజకీయ వాతావరణం, మరియు క్యాంపస్ వివాదాలు ఈ ప్రయాణాన్ని సంక్లిష్టం చేస్తున్నాయి.అమెరికాలో చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్న భారతీయ విద్యార్థులకు వీసా పొందడం అతిపెద్ద సవాలుగా మారింది. ట్రంప్ పరిపాలనలో అమలైన కఠిన ఇమ్మిగ్రేషన్ విధానాలు ఊ?1 విద్యార్థి వీసాల ప్రక్రియను కఠినతరం చేశాయి. మరోవైపు చిన్న నిబంధన ఉల్లంఘనలు, ఉదాహరణకు, ట్రాఫిక్ జరిమానాలు లేదా తరగతులకు హాజరు కాకపోవడం వంటి కారణాలతో వీసాలు రద్దు చేయబడుతున్నాయి. 2023లో, దాదాపు 7 వేల మంది భారతీయ విద్యార్థులు వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అమెరికాలో ఉండిపోయారని నివేదికలు తెలిపాయి. చదువు పూర్తయిన తర్వాత ఉపాధి కోసం ఏ?1ఆ వీసా పొందడం కూడా కష్టతరమైంది, ఇది భారతీయ విద్యార్థులకు ఆర్థిక ఒత్తిడిని పెంచుతోంది.ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (??కఖీ) పథకం భారతీయ విద్యార్థులకు చదువు తర్వాత అమెరికాలో పని అనుభవం పొందే అవకాశాన్ని అందిస్తుంది. అయితే, ఈ పథకాన్ని రద్దు చేయాలనే ప్రతిపాదనలు విద్యార్థులలో ఆందోళన కలిగిస్తున్నాయి. ??కఖీ రద్దు అయితే, విద్యార్థులు చదువు పూర్తయిన వెంటనే దేశం విడిచి వెళ్లవలసి ఉంటుంది, ఇది వారి కెరీర్ ఆకాంక్షలను దెబ్బతీస్తుంది. ఈ విధానం ముఖ్యంగా ఖీఉఓ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) విద్యార్థులను ప్రభావితం చేస్తుంది, ఎందుకంటే భారతీయ విద్యార్థులలో ఎక్కువ మంది ఈ రంగాల్లో చదువుతున్నారు.అమెరికా విశ్వవిద్యాలయాలలో రాజకీయ ఆందోళనలు, వివాదాలు భారతీయ విద్యార్థులను కూడా ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు, పాలస్తీనా?ఇజ్రాయెల్ సంఘర్షణ సంబంధిత ఆందోళనలలో పాల్గొన్న విద్యార్థులు క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొంటున్నారు.ఇటీవలి కొన్ని సంఘటనలలో, ఆందోళనలలో పాల్గొన్న విదేశీ విద్యార్థుల వీసాలపై చర్యలు తీసుకోవడం లేదా విశ్వవిద్యాలయ అడ్మిషన్లపై ఆంక్షలు విధించడం జరిగింది.ఈ విధమైన సంఘటనలు విద్యార్థులను క్యాంపస్ కార్యకలాపాలలో పాల్గొనడానికి భయపడేలా చేస్తున్నాయి, ఇది వారి విద్యా అనుభవాన్ని పరిమితం చేస్తుంది.అమెరికాలో చదువు ఖర్చు ఎక్కువగా ఉండటంతో, భారతీయ విద్యార్థులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఒక సంవత్సరం ట్యూషన్ ఫీజు, జీవన ఖర్చులు సగటున 50 వేల డాలర్ల నుంచి 70 వేల డాలర్ల వరకు ఉ ంటుంది. ఇది చాలా మంది భారతీయ కుటుంబాలకు భారమైనది.తాజాగా ఎంఐటీ యూనివర్సిటీలో చదువుతున్న తెలుగు మూలాలు ఉన్న అమ్మాయి మెఘా వేమూరి గ్రాడ్యుయేషన్ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు భారతీయ విద్యార్థుల అమెరికా చదువులను మరింత జఠిలం చేసే అవకాశం కనిపిస్తోంది. అమెరికా పౌరసత్వం ఉన్న మెతా మేమూరి గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా పాలస్తీనాకు మద్దతుగా మాట్లాడారు. ఇజ్రాయెల్ పాలస్తీనాను కనుమరుగు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎంఐటీ యూడా ఈ హింసలో భాగస్వామి అని పేర్కొన్నారు. అయితే విద్యార్థులకు మాత్రం వర్సిటీ మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అమెరికాలో చదువులోకవాలనుకుంటున్న, చదువుకుంటున్న, అమెరికా వెళ్లాలనుకుంటున్నవారి అవకాశాలకు ఆటంకంగా మారాయి.మెఘా వేమూరి మాట్లాడడానికి ఎన్నో అంశాలు ఉన్నాయి. ఇక్కడ మరో విషయం ఏమిటంటే అమె అండర్ గ్రాడ్యుయేట్. అంటే టీనేజీ అమ్మాయే. అయినా అంత మెచ్యూరిటీగా ఆలోచించడం అభినందనించాల్సిన అంశం. చాలా మంది మెఘాను అభినందిస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి. అయితే ఎంఐటీ యాజమాన్యం మాత్రం ఆమె గ్రాడ్యుయేషన్ సెర్మనీకి రాకుండా నిషేధించింది. ఇక మెఘా వేమూరికి మాట్లాడడానికి ఉక్రెయిన్ ? రష్యా, పహల్గాంతోపాటు అనేక అంశాలు ఉన్నాయి. కానీ ఆమె తనకు గుర్తింపు తెచ్చే అంశాన్ని మాత్రమే ఎంచుకుంది. సాధారణంగా గ్రాడ్యుయేషన్ సెర్మనీలో అందరూ ప్రశంసనీయమైన ప్రసంగం చేస్తారు. మెఘా మాత్రం వివాదాస్పద అంశం ఎంచుకుని తాను గుర్తింపు తెచ్చుకుంది. కానీ, భారతీయుల అమెరికా చదువుల కలకు ఆటంకాలు సృష్టించింది.

# టర్కీ ఆర్థికం..అతలాకుతలం

న్యూఢిల్లీ, జూన్ 2, టర్కీ ఇటీవలి సంవత్సరాలలో పాకిస్థాన్‌తో రాజకీయ, సైనిక సంబంధాలను బలోపేతం చేసింది. 2024లో టర్కీ భారత్‌కు ఆయుధాలు, రక్షణ సామగ్రి ఎగుమతులపై రహస్య నిషేధం విధించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ చర్యలు భారత్?టర్కీ సంబంధాలను మరింత దిగజార్చాయి. అదనంగా, టర్కీ కాశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడం, భారత్‌కు వ్యతిరేకంగా దౌత్యపరమైన వైఖరి అవలంబించడం వంటివి ఈ నిర్ణయానికి కారణమయ్యాయి.భారత ప్రభుత్వం ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో ఉన్న విమాన లీజు ఒప్పందాన్ని ఆగస్టు 31, 2025 నాటికి ముగించాలని ఆదేశించింది. ఈ నిర్ణయం టర్కీ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా దాని ఏవియేషన్ రంగానికి గణనీయమైన ఆఘాతం కలిగిస్తుంది. ఇండిగో భారత్‌లో అతిపెద్ద ఎయిర్‌లైన్ కావడంతో, ఈ ఒప్పందం ముగింపు టర్కిష్ ఎయిర్‌లైన్స్‌కు ఆర్థిక నష్టాన్ని తెస్తుంది.టర్కీ పాకిస్థాన్‌కు అందిస్తున్న డ్రోన్‌లు, ఇతర సైనిక సామగ్రి భారత భద్రతకు ముప్పుగా భావించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ ఈ చర్యను తీసుకుంది. వాణిజ్య, విద్యా సంబంధాలు: భారత్ టర్కీతో వాణిజ్యం, విద్యా రంగాలలో సంబంధాలను సైతం తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉందని కొన్ని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఐఐటీ బొంబాయి, జేఎన్‌యూ వంటి సంస్థలు టర్కీతో సహకారాన్ని పునఃపరిశీలించే అవకాశం ఉంది.ఈ నిర్ణయం భారత్?టర్కీ దౌత్య సంబంధాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. టర్కీ యొక్క పాకిస్థాన్ అనుకూల వైఖరి దీనికి ప్రధాన కారణంగా చెప్పబడుతోంది.భారత్ ఈ నిర్ణయం ద్వారా జాతీయ భద్రతను పరిరక్షించడంతో పాటు, టర్కీ యొక్క పాకిస్థాన్ మద్దతు వైఖరికి గట్టి సందేశం పంపింది. ఈ చర్య భారత్ యొక్క దృఢమైన విదేశాంగ విధానాన్ని, జాతీయ ఆసక్తులను కాపాడుకోవడంలో దాని నిబద్ధతను సూచిస్తుంది.టర్కీతో విమాన లీజు ఒప్పందాన్ని ముగించాలని ఇండిగోకు భారత్ ఆదేశించడం ద్వారా టర్కీ ఆర్థిక, వాణిజ్య రంగాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. ఈ చర్య భారత్?టర్కీ సంబంధాలలో కొత్త ఒత్తిడిని సష్టించినప్పటికీ, జాతీయ భద్రత, దౌత్య సమతుల్యతను కాపాడుకోవడంలో భారత్ యొక్క స్పష్టమైన వైఖరిని ప్రతిబింబిస్తుందిభారత ప్రభుత్వం టర్కీతో వాణిజ్య సంబంధాలపై కఠిన నిర్ణయం తీసుకుంది. జాతీయ భద్రతా ఆందోళనలు, టర్కీ యొక్క పాకిస్థాన్‌కు మద్దతు నేపథ్యంలో, ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో విమాన లీజు ఒప్పందాన్ని మూడు నెలల్లో ముగించాలని కేంద్రం ఆదేశించింది. ఈ నిర్ణయం టర్కీ యొక్క ఇటీవలి చర్యలు, ముఖ్యంగా పాకిస్థాన్‌కు డ్రోన్‌లు, సైనిక సహాయం అందించడం వంటి వాటిపై భారత్ ఆందోళనలకు ప్రతిస్పందనగా వచ్చింది.టర్కీ ఇటీవలి సంవత్సరాలలో పాకిస్థాన్‌తో రాజకీయ, సైనిక సంబంధాలను బలోపేతం చేసింది. 2024లో టర్కీ భారత్‌కు ఆయుధాలు, రక్షణ సామగ్రి ఎగుమతులపై రహస్య నిషేధం విధించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ చర్యలు భారత్?టర్కీ సంబంధాలను మరింత దిగజార్చాయి. అదనంగా, టర్కీ కాశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడం, భారత్‌కు వ్యతిరేకంగా దౌత్యపరమైన వైఖరి అవలంబించడం వంటివి ఈ నిర్ణయానికి కారణమయ్యాయి.భారత ప్రభుత్వం ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను టర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో ఉన్న విమాన లీజు ఒప్పందాన్ని ఆగస్టు 31, 2025 నాటికి ముగించాలని ఆదేశించింది. ఈ నిర్ణయం టర్కీ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా దాని ఏవియేషన్ రంగానికి గణనీయమైన ఆఘాతం కలిగిస్తుంది. ఇండిగో భారత్‌లో అతిపెద్ద ఎయిర్‌లైన్ కావడంతో, ఈ ఒప్పందం ముగింపు టర్కిష్ ఎయిర్‌లైన్స్‌కు ఆర్థిక నష్టాన్ని తెస్తుంది.టర్కీ పాకిస్థాన్‌కు అందిస్తున్న డ్రోన్‌లు, ఇతర సైనిక సామగ్రి భారత భద్రతకు ముప్పుగా భావించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ ఈ చర్యను తీసుకుంది. వాణిజ్య, విద్యా సంబంధాలు: భారత్ టర్కీతో వాణిజ్యం, విద్యా రంగాలలో సంబంధాలను సైతం తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉందని కొన్ని సోషల్ మీడియా పోస్ట్‌లు సూచిస్తున్నాయి. ఐఐటీ బొంబాయి, జేఎన్‌యూ వంటి సంస్థలు టర్కీతో సహకారాన్ని పునఃపరిశీలించే అవకాశం ఉంది.ఈ నిర్ణయం భారత్?టర్కీ దౌత్య సంబంధాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. టర్కీ యొక్క పాకిస్థాన్ అనుకూల వైఖరి దీనికి ప్రధాన కారణంగా చెప్పబడుతోంది.భారత్ ఈ నిర్ణయం ద్వారా జాతీయ భద్రతను పరిరక్షించడంతో పాటు, టర్కీ యొక్క పాకిస్థాన్ మద్దతు వైఖరికి గట్టి సందేశం పంపింది. ఈ చర్య భారత్ యొక్క దృఢమైన విదేశాంగ విధానాన్ని, జాతీయ ఆసక్తులను కాపాడుకోవడంలో దాని నిబద్ధతను సూచిస్తుంది.టర్కీతో విమాన లీజు ఒప్పందాన్ని ముగించాలని ఇండిగోకు భారత్ ఆదేశించడం ద్వారా టర్కీ ఆర్థిక, వాణిజ్య రంగాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. ఈ చర్య భారత్?టర్కీ సంబంధాలలో కొత్త ఒత్తిడిని సష్టించినప్పటికీ, జాతీయ భద్రత, దౌత్య సమతుల్యతను కాపాడుకోవడంలో భారత్ యొక్క స్పష్టమైన వైఖరిని ప్రతిబింబిస్తుంది.

# పార్టీల్లో రెబల్స్ బెడద...

హైదరాబాద్, జూన్ 2 తెలంగాణలో రెబల్స్ పార్టీలకు తలనొప్పిగా మారాయి.ఒకటి ప్రాంతీయ పార్టీ. ఇంకో రెండు జాతీయ పార్టీలు. ఆ మూడు పార్టీల్లో ఆ ముగ్గురు సీనియర్ లీడర్లు. జీవన్‌రెడ్డి ఫక్తు కాంగ్రెస్ వాది. కవిత బీఆర్‌ఎస్‌లో, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. ఇక రాజాసింగ్ కట్టర్ హిందూ. బీజేపీ కోర్ ఐడియాలజీకి దగ్గరగా మాట్లాడుతుంటారు. అయితే ఈ ముగ్గురు నేతలు ఇప్పుడు సొంత పార్టీల అ?రగనేతలే టార్గెట్‌గా బాణాలు వదలుతున్నారు. ఇందులో ఒక్కొక్కరిది ఒక్కో పరిస్థితి.ప్రస్తుతం తెలంగాణలో ప్రైమ్ టైమ్ డిబేట్గా ఉంటున్న టాపిక్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యవహారం. ఇంతకాలం పార్టీలో ప్రతి ఒక్కరూ అత్యంత క్రమశిక్షణతో వ్యవహరించిన ఆమె..ఇప్పుడు ఏకంగా అన్న కేటీఆర్ టార్గెట్ విమర్శలు సంధిస్తున్నారు. ఆమె రాసిన లెటర్, ఆపై సంచలన కామెంట్స్, తర్వాత ఆఫ్ ది రికార్డులో చేసిన కామెంట్స్‌తో బీఆర్‌ఎస్‌లో ప్రకంపనలకు తెరలేపింది.కవిత స్టేట్‌మెంట్స్ ప్రత్యర్థి పార్టీలకు అస్త్రంగా మారడంతో కారు పార్టీ లీడర్లకు మింగుడు పడడం లేదు. బీజేపీ బీఆర్‌ఎస్ విలీనం.. కేసీఆర్ చుట్టూ దయ్యాలు ఉన్నాయంటూ చేస్తున్న కామెంట్స్ సొంత పార్టీ నేతలను ఇరుకున పెడుతున్నాయి. పోనీ కవితపై చర్యలు తీసుకుందామంటే.. పరిస్థితి ఎలా ఉంటుందో అంతు చిక్కడం లేదట. ఇలా బీఆర్‌ఎస్ పార్టీకి కొరకరాని కొయ్యలా తయారయ్యారు ఎమ్మెల్సీ కవిత.క్రమశిక్షణకు మారు పేరుగా ఉండే కాషాయ పార్టీలో కూడా కల్లోలం మొదలైంది. గత కొంతకాలంగా బీజేపీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న.. ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యవహారం భగ్గుమంటుంది. రాజాసింగ్ ఎక్కుపెడుతున్న మిసైల్స్‌తో..సొంత పార్టీ లీడర్లు గందరగోళంలో ఉన్నారట. రాజాసింగ్ సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారట. గతంలో సొంత పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలను పాత ఇనుప సామానుతో పోల్చి చర్చకు తెరలేపారు రాజాసింగ్.లేటెస్ట్‌గా ఎమ్మెల్సీ కవిత వాఖ్యలను కోట్ చేస్తూ..తమ పార్టీ నేతలకు మరింత ఇరుకున పెడుతున్నారు. పార్టీలో దొంగలున్నారని..మంచి ప్యాకేజీ ఇస్తే ఎవరితోనైనా పొత్తు పెట్టుకుంటారంటూ రాజాసింగ్ చేసిన కామెంట్స్ కమలం పార్టీలో హాట్ టాపిక్‌గా మారాయి. రాజాసింగ్ వ్యాఖ్యలపై స్పందించేందుకు ఏ ఒక్క నేత ముందుకు రావడం లేదు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే బీజేపీలో..రాజాసింగ్ ఎక్కుపెడుతున్న బాణాలకు సమాధానం ఇచ్చుకోలేకపోతున్నారు. బీజేపీ నాయకత్వం సైలెంట్‌గా ఉంటున్న.. రాజాసింగ్ మాత్రం రోజుకో మిస్సైల్‌ను పేల్చుతున్నారు. ఒకవేళ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకుంటే ఏం జరుగుతుందోనన్న ఆందోళన ఆ పార్టీ నేతల్లో ఉందట. అందుకే ఏ ఒక్క నేత కిమ్మనడం లేదట.కాంగ్రెస్ పార్టీలో కూడా ఓ సీనియర్ లీడర్ అసంతృప్తి గళం రాష్ట్ర నేతలకు హెడెక్‌గా మారిందట. హస్తం పార్టీలో సీనియర్ లీడర్‌గా పేరున్న మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యవహారం కొన్నాళ్లుగా హాట్ టాపిక్ ఉంటోంది. జగిత్యాలలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి జీవన్ రెడ్డి వ్యవహారం పార్టీకి తలనొప్పి గా మారిందట. పార్టీ ఫిరాయింపులతో మొదలుకొని..ఈ మధ్య జగిత్యాల జిల్లా పర్యటనకు వెళ్లిన పలువురు మంత్రులు ఎదుటే తన వాయిస్ వినిపిస్తూ జీవన్‌రెడ్డి చేసిన కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి.మంత్రి పొంగులేటి జగిత్యాలకు వచ్చిన సందర్భంగా మీరే రాజ్యం ఏలుకొండంటూ జీవన్ రెడ్డి చేసిన కామెంట్స్ కాక పుట్టించాయి. అంతకు ముందు జానారెడ్డి, రేవంత్ రెడ్డిలకన్నా తానే సీనియర్ అని? పార్టీ ఫిరాయింపులు సరికాదంటూ ఆయన వదిలిన బాణాలు ఎవరెవరికో తగిలాయి. ఇలా జీవన్ రెడ్డి వ్యవహారం హస్తం పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా? ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితి. ఇలా ఆ ముగ్గురు నేతల తీరు..ఆ మూడు రాజకీయ పార్టీలను ఉ క్కపోతకు గురిచేస్తుంది. ఈ ముగ్గురు విషయంలో మూడు పార్టీలకు ఏం చేద్దామన్నా ముందు నుయ్యి.. వెనక గొయ్యిలా మారిందట. చూడాలి మరి.. వీరి అసంతృప్తి గళానికి ఆయా పార్టీల అగ్రనేతలు ఎలాంటి ముగింపు ఇస్తారో.తెలంగాణ బీజేపీలో మరోసారి అంతర్గత విభేదాలు తెరపైకి వచ్చాయి. తనకు వ్యతిరేకంగా కరీంనగర్ నుంచి యుద్ధం మొదలైందంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇది ప్రత్యక్షంగా చెప్పకపోయినా, పరోక్షంగా బీజేపీ నాయకుడు బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇప్పటికే గతంలో కిషన్ రెడ్డి, రాజాసింగ్ మధ్య బండి సంధి కుదిర్చిన విషయం తెలిసిందే. తాజాగా రాజాసింగ్ సంజయ్‌పైనే వ్యాఖ్యలు చేయడంతో, కమలదళంలో అంతర్గత కలహాలు మరింత తీవ్రరూపం దాల్చినట్టు కనపడుతోంది.

# ఏం చేయాలి...

### కేసీఆర్ అంతర్మథనం

హైదరాబాద్, జూన్ 2, భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్), గతంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్), కేసీఆర్ రాజకీయ విజన్‌కు కేంద్ర బిందువు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఈ పార్టీ కీలక పాత్ర పోషించింది. 2001లో స్థాపితమైన ఈ పార్టీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను రాజకీయంగా సమీకరించి, 2014లో రాష్ట్ర సాధనను సాకారం చేసింది. కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను గ్రామీణ, పట్టణ ఓటర్లను ఆకర్షించే విధంగా నిర్మించారు. సంక్షేమ పథకాలు, రైతు సమస్యలపై దృష్టి, రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలు దీని బలం. 2022లో టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చి, జాతీయ రాజకీయాల్లో పాత్ర పోషించాలనే కేసీఆర్ లక్ష్యం స్పష్టమైంది. అయితే, 2023 ఎన్నికల్లో ఓటమి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడం పార్టీకి సవాళ్లను తెచ్చింది.తెలంగాణ జాగృతి, కేసీఆర్ కుమార్తె కవిత నేతృత్వంలో, తెలంగాణ సంస్కృతి, ఆకాంక్షలను బలోపేతం చేసే సాంస్కృతిక ఉద్యమం. ఇది కేసీఆర్ రాజకీయ దృష్టికి భావజాల బలాన్ని జోడించింది. తెలంగాణ జాగృతి సాహిత్యం, కళలు, సంప్రదాయాలను పరిరక్షించడం, ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో రాష్ట్ర గుర్తింపును బలపరిచింది. ఇది బీఆర్‌ఎస్‌కు భావజాల ఆధారాన్ని అందించింది. జాగృతి కార్యక్రమాలు యువత, మహిళలను ఆకర్షించడంలో కీలకంగా ఉన్నాయి. అయితే, కవిత రాజకీయ పరిణామాలు, ఇటీవలి ఆరోపణలు ఈ సంస్థ ప్రభావాన్ని కొంత దెబ్బతీశాయి.కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), కేసీఆర్ కుమారుడిగా, బీఆర్‌ఎస్‌లో రెండవ అతి ముఖ్యమైన నాయకుడిగా ఉన్నారు. ఆయనను 'మూడో కన్ను'గా పేర్కొనడం ఆయన వ్యూహాత్మక దృష్టి, ఆధునిక రాజకీయ సాంకేతికతలో నైపుణ్యాన్ని సూచిస్తుంది. కేటీఆర్ బీఆర్‌ఎస్‌లో యువ నాయకుడిగా, సామాజిక మాధ్యమాలను వినియోగించడంలో, పార్టీ సందేశాన్ని ఆధునిక ఓటర్లకు చేరవేయడంలో నైపుణ్యం కనబరిచారు. ఐటీ, పరిశ్రమల మంత్రిగా హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చడంలో ఆయన పాత్ర గణనీయం. కేటీఆర్ పార్టీలో ఆధునికీకరణకు, యువతను ఆకర్షించడానికి కృషి చేస్తున్నారు. ఆయన సోషల్ మీడియా వేదికల్లో చురుకైన ఉనికి, ప్రతిపక్షాలపై సమర్థవంతమైన విమర్శలు బీఆర్‌ఎస్‌కు కొత్త ఊపును తెచ్చాయి.

# అడ్డంగా బుక్కైన సన్నీ...



హైదరాబాద్, జూన్ 2 భయ్యా సన్నీ యాదవ్ .. ఈపేరు తెలుగు రాష్ట్రాల్లో పెను దుమారం రేపుతోంది. మీడియా ఛానెల్స్ అయితే వరుస కథనాలతో ఓ రేంజ్ లో ఉతికి ఆరేస్తున్నాయి. తెలంగాణలో నల్గొండ జిల్లాకు చెందిన ఇతను ఓ యూట్యూబర్. బైక్ రైడర్. దేశ , విదేశాలకు బైక్ పై తిరుగూ అక్కడ సంస్కృతీ సంప్రదాయాలను ఎక్స్ ప్లోర్ చేస్తూ వీడియోలు చేస్తుంటాడు. అలా తీసిన వీడియోలను భయ్యా సన్నీ యాదవ్ పేరుతో ఉన్నయ్యూట్యూబ్ ఛానెల్ లో పబ్లిష్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఇటీవల సన్నీ బైక్ పై పాకిస్తాన్ వెళ్లాడు. అక్కడ వివిధ ప్రాంతాలు తిరుగూ వీడియోలు చేశాడు. ఇప్పుడు ఈ పర్యటన వివాదంగా మారింది. ఎన్ ఐఏ కి అనుమానం రావడంతో సన్నీని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం..హర్యానాకు చెందిన జ్యోతి మల్హోత్రాను ఇటీవల ఎన్ ఐఏ అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. యూట్యూబర్ ముసుగులో దేశభద్రతకు ముప్పువాటిల్లే సమాచారం పాక్ ఉగ్రవాదులకు లీక్ చేసిందనే ఆరోపణలపై జ్యోతి మల్హోత్రా ఎన్ ఐఏ అదుపులో ఉంది. విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా అదే కోవలోకి భయ్యా సన్నీ యాదవ్ చేరారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ఇటీవల బైక్ పై పాకిస్తాన్ వెళ్లిన సన్నీయాదవ్ సుమారు ఆరునెల పాటు పాకిస్తాన్ లో వివిధ ప్రాంతాలు తిరుగుతూ ,వీడియోలు చేస్తూ ..సరిగ్గా పెహల్గామ్ దాడికి 12రోజులు ముందుగా పాకిస్తాన్ నుంచి హైదరాబాద్ కు వచ్చినట్లు సమాచారం.వ్లాగర్ అన్నాక మరో దేశం వెళ్లడం తప్పులేదని అనుకోవచ్చు. కానీ సరిగ్గా ఏడు నెలల క్రితం పాకిస్తాన్ లో జకీర్ నాయక్ తో భయ్యా సన్నీ యాదవ్ ఓ సమావేశంలో పాల్గొనడం, అక్కడ జకీర్ తో వన్ టూ వన్ మాట్లాడటం పెనుదుమారం రేపుతోంది. ఎందుకంటే ఈ జకీర్ నాయక్ ఓ ముస్లిం మత ప్రభోధకుడు. ఇతని ప్రసంగాలు మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉండటంతో భారత్ ఇతనిని దేశ బహిష్కరణ చేసింది. ఇతని వీడియోలను నిషేధించింది. అంతేకాదు జకీర్ పై ఎన్ ఐఏ ఛార్జిషీట్ దాఖలు చేసింది. రెడ్ కార్నర్ నోటీసులు సైతం ఇచ్చింది. కానీ అరెస్ట్ నుంచి తప్పించుకుని ఇతర దేశాల పౌరసత్వం సాకుగా చూపి తిరుగుతున్నాడు ఈ దేశ శత్రువు. అంతలా భారత్ లో ఆంక్షలు విధించిన జకీర్ తో గత ఏడాది అక్టోబర్ 28వ తేదిన పాకిస్తాన్ పర్యటనలో ఉన్న సన్నీ యాదవ్ కలిశారు. జకీర్ ప్రసంగిస్తున్న సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పుడు ఆ వీడియో వైరల్ కావడంతో అనేక అనుమానాలు బలపడుతున్నాయి.జకీర్ సమావేశంలో సన్నీయాదవ్ జకీర్ ను ఓ ప్రశ్న అడుగుతాడు. హిందూ ధర్మం ప్రపంచానికి చాలా ఇచ్చింది. యోగా పేరుతో ఫిట్ నెస్, ఆయుర్వేదంతో ఆరోగ్యం, వేదా ద్వారా జ్ఞానాన్ని ఇస్తోంది. మరి మీ ఖురాన్ ప్రపంచానికి ఏం ఇస్తుంది..? అనే ప్రశ్న జకీర్ ను అడుగుతాడు సన్నీ యాదవ్. జకీర్ మాట్లాడుతూ.. మీ హిందువుల్లో ఎంతమంది యోగా చేస్తున్నారు అని సన్నీని ప్రశ్నిస్తాడు. 1లేదా 2శాతం ఉంటారని సన్నీ సమాధానం చెబుతాడు. జకీర్ మాట్లడుతూ.. మా ముస్లింలు రోజులో ఐదుసార్లు ఖురాన్ చదువుతారంటూ మొదలు పెట్టి ఖురాన్ ప్రసిద్ధి గురించి, హిందూ ధర్మంతో పోల్చుతూ అవహేళన చేసేలా మాట్లడతాడు. ఇప్పుడు ఈ వీడియో వైరల్ గా మారింది.జకీర్ సమావేశంలో సన్నీపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. జకీర్ సమవేశం అంటే ప్రత్యేకంగా ఓ మతానికి చెందిన అంతరంగిక సమావేశంలా ఉంటుంది. అతి కొద్దిమందిని మాత్రమే జకీర్ తో మాట్లాడేందుకు అనుమతిస్తారు. సమావేశానికి ఇతర మతస్థులను రానివ్వరు. ఈ నేపథ్యంలో సన్నీ ఎలా ఈ సమావేశంలోనికి వెళ్లగలిగాడు. నేరుగా జకీర్ ను ప్రశ్నించాడంటే ఆ ప్రశ్నల వెనుక ఎవరున్నారు..? ఒకప్పుడు అంత సహసం చేయలేదు. అంతలా నమ్మకంగా ఉ న్నాడంటే సన్నీ యాదవ్ వారికి ఏం సహకరిస్తున్నాడు. ఇవే అనుమానాలు ఈరోజు ఎన్ ఐఏ అదుపులో సన్నీ యాదవ్ విచారణ ఎదుర్కొనే పరిస్థితికి తీసుకొచ్చాయి.సన్నీ యాదవ్ ను ఎన్ ఐఏ అదుపులోకి తీసుకున్న తరువాత సన్నీ తండ్రి మీడియాతో మాట్లడుతూ ఫిబ్రవరి నెలలో నా కొడుకు సన్నీ పాకిస్తాన్ వెళ్లాడు. నెలన్నర మాత్రమే ఉండి మార్చిలో ఇండియా వచ్చేశాడని చెబుతున్నారు. ఫిబ్రవరిలో వెళితే అక్టోబర్ లో జకీర్ తో సమావేశంలో ఎలా సన్నీ పాల్గొన్నాడు..? ఇదిలా చెన్నైలో తన స్నేహితుడు చెర్రీ మాట్లడుతూ సన్నీ యాదవ్ నన్ను కలవడానికే చెన్నై వచ్చాడని ,తప్పుడు ప్రచారం చేయొద్దంటూ , నిన్న ఓ వీడియో పోస్ట్ చేశాడు. ఈరోజు జకీర్ వీడియో వైరల్ కావడంతో, తాను పోస్ట్ చేసిన వీడియో డిలీట్ చేసేశాడు చెర్రీ. ఇలా ఎందుకు చేశాడు. ఇవే అనేక అనుమానాలకు తావిస్తోంది. జ్యోతి మల్హోత్రాలా సన్నీ కూడా పాక్ తీవ్రవాదులతో చేతులు కలిపాడా, లేక కాకతాళియంగా ఇవన్నీ జరిగాయా అనేది ఎన్ ఐఏ విచారణలోనే తేలాల్సి ఉంది.

# డ్రైవింగ్ స్కూల్స్ దందా



నల్గొండ, జూన్ 2, కారు అంటే ప్రతి ఒక్కరికి నడపాలని ఉంటుంది. అందుకే ఉద్యోగులు, యువత, గృహిణులు డ్రైవింగ్ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. దీన్ని అదునుగా చూసుకొని నల్లగొండ జిల్లాలో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు రెచ్చిపోతున్నాయి. ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారు. డ్రైవింగ్ నేర్పిస్తే రూ.4 వేలు నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. లైసెన్స్ ఇప్పిస్తామని చెప్పి అదనంగా మరో రూ.3 వేలు నుంచి రూ.4 వేలు వరకు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా చెప్పాలంటే లైసెన్స్ ఇచ్చే అధికారం శిక్షణ కేంద్రాలకు లేదు. ఆర్డీఏ కార్యాలయంలో పెట్టే పరీక్షలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు తామే ఇప్పిస్తామంటూ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో ఉన్న అన్ని డ్రైవింగ్ స్కూళ్లలో ఇదే తంతు జరుగుతుంది.డ్రైవింగ్ స్కూళ్లలో చేరేవారికి 20 రోజు లు వివిధ రకాల అంశాల్లో శిక్షణ ఇవ్వాలి. మొదట సి మ్యులేట్ప నేర్పించడంతో పాటు తరగతిలో పాఠాలు బోధించాలి. చివరి దశలో మాత్రమే వాహనంలో కూర్చోబెట్టి ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. కానీ జిల్లాలో చాలా శిక్షణ కేంద్రాల్లో ఇవేమీ పాటించట్లేదు. వారం నుంచి 10 రోజుల పాటు రహదారులపై స్టీరింగ్ అప్పగించి తిప్పుతున్నారు. చాలా తక్కువ సమయంలో ఎక్కువ మందికి నేర్పిస్తున్నారు.ఆర్టీఏ కార్యాలయంలో ఎలాంటి పరీక్ష పెట్టకుండా డబ్బులకు ఆశపడి లైసెన్సు ఇప్పిస్తున్నారు. శిక్షణ ఇచ్చే ముందు రవాణా శాఖ అనుమతి కలిగిన రిజిస్టర్డు నంబరు వాహనాన్ని వినియోగించాలి. కానీ చాలా చోట్ల ఫిట్నెస్ లేని వాటిని రోడ్డెక్కిస్తున్నారు. నంబరు ప్లేట్ లేనివి, కాలపరిమితి తీరిన వాటిపై శిక్షణ ఇస్తున్నారు. ఒకే వాహనానికి అనుమతి ఉంటే రెండు, మూడు కార్లకు బోర్డులు పెట్టి శిక్షణ ఇస్తున్నారు.కరోనా తర్వాత ప్రైవేట్ వాహనాల వినియోగం అధికమైంది. కార్ల అమ్మకాలు భారీగా పెరిగా యి. ఇటీవలె కాలంలో ఆడా, మగ తేడా లేకుండా డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని శిక్షణ కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు.పూర్తి స్థాయిలో నడవడం నేర్పకుం డానే, భద్రతా సూచికలపై అవగాహన కల్పించకుండానే లైసెన్సు ఇప్పిస్తున్నారు. వాహనాన్ని ఎలా నడపాలని మాత్రమే చెబుతూ రహదారి నిబంధనలపై పూర్తి స్థాయిలో చెప్పట్లేదు. ఈ కారణంగా ఇటీవల కాలంలో రహదారి ప్రమాదాలు పెరుగుతున్నాయి.అనుమతి పొందిన డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ ఎలా ఇస్తున్నారు. డ్రైవింగ్కు వినియోగిస్తున్న వాహనాల స్థితి, ఫీజుల తీరుపై రవాణా శాఖ అధికారులు నిఘా పెట్టాలి. జిల్లాలో ఎక్కడా ఇలాంటి తనిఖీలు జరగడం లేదు. దీంతో శిక్షణ ఇస్తున్నవారు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. రికార్డుల్లో పేర్కొన్న నంబరు కలిగిన వాహనం రోడ్లపై కనిపించదు. శిక్షణ కేంద్రాలను ఆన్లైన్ చేయకపోవడం నియంత్రనణ చేయడం లేదు.కొన్ని డ్రైవింగ్ స్కూళ్లలో అనుమతి గడువు దాటినా శిక్షణలు ఇస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో కీలకమైన డ్రైవింగ్ శిక్షణపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు తెలుపుతున్నారు. డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ, వినియోగిస్తున్న వాహనాల స్థితి, ఫీజుల తీరుపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలి.డ్రైవింగ్ నేర్పిస్తున్న వాహనం ఎన్ని కిలోమీటర్లు తిరిగిందో పరిశీలించడం లేదు. రికార్డుల్లో పేర్కొన్న నంబరు కలిగిన వాహనం రోడ్లపై కనిపించదు. కొన్ని స్కూళ్లకు అనుమతి గడువు దాటినా శిక్షణలు ఇస్తున్నారు. ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో కీలకమైన డ్రైవింగ్ శిక్షణపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరముంది.

# కాంగ్రెస్ కమిటీల్లో మహిళలు ఎక్కడ.

హైదరాబాద్, జూన్ 2, కాంగ్రెస్ అధిష్ఠానం ఇటీవలే ప్రకటించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి సంబంధించిన ఐదు కమిటీలపై పలువురు సీనియర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇక మహిళలకు పార్టీ పదవుల విషయంలో పూర్తిగా నిరక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు.ఢిల్లీలో సోనియాగాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్గా మీనాక్షినటరాజన్ ఉన్నప్పటికీ.. ఏఐసీసీ ప్రకటించిన ఐదు కమిటీల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించకుండా మొండిచెయ్యి చూపారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ మహిళలకు చట్టసభల్లో 33శాతం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజ ర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్ ఉభయసభల్లో మహిళా బిల్లును తక్షణమే అమల్లోకి తీసుకురావాలని రాహుల్ గాంధీ డిమాండ్చేస్తున్నారు. కానీ తమ పార్టీ పదవుల విషయం లో మాత్రం మహిళలకు 33 శాతం ఎందుకు అమలుచేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.గత శుక్రవారం ప్రకటించిన ఐదు కమిటీల్లో మొత్తం 66మంది ఉండగా, మహిళలకు ఆరుగురికి మాత్రమే చోటివ్వడంపై విస్మయం వ్యక్తమవుతోంది. 'మహిళల ఓట్లు కావాలి.. మహి ళలు పార్టీ కోసం పనిచేయాలి.. పదవుల పంపకం వచ్చేసరికి చిన్నచూపా' అని నారీమణులు మండిపడుతున్నారు. ఒకవైపు మహిళలకు కమిటీల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని ఆవేదనతో ఉండగానే మరోవైపు రాజకీయ వ్యవహారాల కమిటీలో సీనియర్ నాయకులను పక్కనపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఒకరిద్దరు నాయకులకు రెండు కమిటీల్లో అవకాశం కల్పించడం.. కొందరు సీనియర్ నాయకులు, కొందరు మంత్రులను పక్కనపెట్టడం ఏంటనీ..? ప్రశ్నిస్తు న్నారు.కాగా, కాంగ్రెస్ పార్టీలో అత్యంత ప్రాధాన్యంగా భావించే రాజకీయ వ్యవహారాల కమిటీని 22మందితో ప్రకటించగా, మహిళల నుంచి మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిలకు మాత్రమే అవకాశం కల్పించారు.మిగతా 20మందిలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్, సీఎం రేవంత్రెడ్డి, డిప్యూ టీ సీఎం భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్, మంత్రులు దామోదర రాజనరసింహ, శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, సీతక్క, నాయకులు షబ్బీర్అలీ, అజారుద్దీన్, ప్రభు త్వ విప్లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు సుదర్శన్రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, ప్రేమ్సాగర్రావుతో పాటు జెట్టి కుసుమకుమార్, ఈరవత్రి అనిల్ ఉన్నారు.అయి తే ఈ రాజకీయ వ్యవహారాల కమిటీలో మిగతా మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావుకు చోటు ఇవ్వక పోవడంపై అసంతృప్తితో ఉన్నారు. ఇక ఇప్పటి వరకు పీఏసీలో పీసీసీ మాజీ అధ్యక్షులు, మాజీ సీఎల్పీ నేతలకు కూడా చోటు ఉండే ది, కానీ ఇటీవల ప్రకటించిన కమిటీలో పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హనుమంతరావు, జానారెడ్డిని విస్మరించడపై సొంత పార్టీ నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక పీసీసీ సలహాదారు (అడ్వయిజరీ)కమిటీని 15మందితో ప్రకటించినప్పటికీ.. మహిళల నుంచి మాజీమంత్రి గీతారెడ్డికి మాత్రమే అవకాశం కల్పించారు. ఈ కమిటీలోనూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్, సీఎం సీఎం రేవంత్రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీ హనుమంతరావు, జానారెడ్డి, కేశవరావు, మధుయాష్కీ గౌడ్, చిన్నారెడ్డి, అంజన్కుమార్యాదవ్, జగ్గారెడ్డి, జాఫర్ జావెద్, మాజీమంత్రి జీవన్రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఉ న్నారు.అయితే ఈ కమిటీలో మహిళల నుంచి గీతారెడ్డికి చోటు ఇవ్వగా, ఆమె కొంత కాలంగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ గీతారెడ్డితోపాటు మ రొకరికి అవకాశం కల్పిస్తే బాగుండేదనే అభిప్రాయం కాంగ్రెస్ మహిళా నేతల నుంచి వ్యక్తమవుతోంది. రాజ్యాంగ పరిరక్షణ కమి టీ (సంవిధాన్ బచావో)ను 16మందితో ప్రకటించగా, అదిలాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసిన ఓటమి చెందిన ఆత్రం సుగుణ, జూలూరి ధనలక్ష్మికి మాత్రమే అవకాశం ఇచ్చారు.రాజ్యాంగ పరిరక్షణ కమిటీలో పీ వినయ్కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే శంకరయ్య, బాలునాయక్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పార్టీ నాయకులు రాచమల్ల సిద్దేశ్వర్, కే సంతోష్, పులి అనిల్కుమార్, మాజిద్ఖాన్, జీ రాము లు, అర్జున్రావు, శౌరీ, కే వల్లభరెడ్డి, వీ శ్రీ కాంత్రెడ్డి ఉన్న విషయం తెలిసిందే.డీలిమిటేషన్ కమిటీని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్రెడ్డి నేతృత్వంలో ఏడుగురితో కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన కమిటీలో హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మిని మాత్రమే నియమించారు. ఈ కమిటీ లో వంశీచంద్రెడ్డి, గద్వాల విజయలక్ష్మితో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మె ల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రావణ్కుమార్రెడ్డి, పవన్ మల్లాడి, డీ వెంకటరమణ ఉన్నారు. ఇదిలాఉండగా పార్టీలో అత్యంత కీలకమైన పీసీసీ క్రమశిక్షణ కమిటీలో మహిళలను పూర్తిగా విస్మరించారు. పార్టీ సీనియర్ నేత, ఎంపీ మల్లు రవి చైర్మన్గా, పార్టీ సీనియర్ నేత శ్యామ్ మోహన్ వైస్చైర్మన్గా ఉండగా, నిరంజన్రెడ్డి, కుమార్రావు, జాఫర్ జావెద్, జీవీ రామ కృష్ణ సభ్యులుగా ఉన్నారు. ఆరుగురితో నియమించిన ఈ కమిటీకి అర్హులైన మహిళలు పార్టీలో దొరకడం లేదా..? అనే ప్రశ్నలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి.ఇటీవలనే పీసీసీ మహిళా విభాగం అధ్య క్షురాలు సునీతారావు కూడా పార్టీకోసం కష్టపడిన మహిళలకు పదవు ల్లో అవకాశం కల్పించాలని గాంధీభవన్లోనే ఆందోళన చేసిన విషయం తెలిసిందే.

## తెలంగాణ ప్రజానీకానికి రాష్ట్ర ఆవిర్భావ శు భాకాంక్షలు: టిపిసిసిఅధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ జూన్ 2, తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం ×ఆరు దశాబ్దాల నిరీక్షణకు తెరదించిందీ కాంగ్రెస్ పార్టీ. ఎన్నో ప్రాణత్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇంధిరమ్మ ఆశయాలకు న్యాయం జరిగిందీ తెలంగాణ ద్వారా. పునర్నిర్మాణ దిశగా కాంగ్రెస్ పాలన కానసాగుతోందని టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం గాంధీ భవన్ లో అయన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల ఆర్థిక విధ్వంసాన్ని అధిగమిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం బాటలో తెలంగాణ నడుస్తోంది. అభివృద్ధి, సంక్షేమం ? రెండు కళ్ల సిద్ధాంతంతో పాలన సాగుతోంది. సామాజిక న్యాయం ? కాంగ్రెస్ సంకల్పం. శాస్త్రీయ కులగణన, బీసీలకు 42% రిజర్వేషన్లు. ఎస్సీ వర్గీకరణతో దేశానికే మార్గదర్శకం. దేశవ్యాప్తంగా కుల సర్వే జరగాలన్న రాహుల్ గాంధీ ఆకాంక్ష. ఒక్క ఏడాదిలోనే 65,000 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. రాజీవ్ యవ వికాస్ ద్వారా 5 లక్షల యువతకు ఆర్థిక సాయం. మహిళా సాధికారత దిశగా మహాలక్ష్మి పథకం ప్రారంభం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ? 50 లక్షల కుటుంబాలకు లబ్ధి. రూ.500 గ్యాస్ సబ్సిడీ ? 40 లక్షల కుటుంబాలకు ఉపశమనం. × రైతుల సంక్షేమం కోసం రూ. 21,000 కోట్ల రుణమాఫీ తో 25 లక్షల రైతులకు ఉపశమనం. రూ.500 వరి బోనస్ తో సన్న బియ్యం ఉత్పత్తి పెరుగుదల. 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య దిగుబడితో దేశంలో ప్రథమ స్థానంలో తెలంగాణ వుందని అన్నారు.

## పచ్చదనం కరవవుతున్న ప్రకృతి వనాలు

మహబూబ్ నగర్, జూన్ 2, బీఆర్ ఎస్ ప్రభుత్వం..అధికారులు, ప్రజలు, పాలకుల భాగస్వామ్యంతో ప్రతి మారుమూల ప్రాంతం, గిరిజన గూడెలలో సైతం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు అయ్యాయని చెప్పవచ్చు. అంతేకాదు రహదారులు, ప్రభుత్వ, ప్రైవేటు యునిస్ట్యూషన్లో మొక్కలు నాటడంలో ముందుకు వెళ్ళింది. ఈ కార్యక్రమం ఓ యజ్ఞంలా.. ప్రభుత్వ లక్ష్యంలో ప్రతి ఒక్కరు పాలు పంచుకున్నారు. గ్రామాలలో పచ్చదనం పెంచడం..ఆరోగ్యకర వాతావరణం లక్ష్యంగా పల్లె ప్రజలకు దూర ప్రాంతాలకు వెళ్ళకుంగా ఆ గ్రామములోనే పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే గత ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అందుకు పల్లె ప్రకృతి వనం ఏర్పాటుకు ప్రతి గ్రామములో పచ్చదనం పెంచడం.. ఆరోగ్యకర వాతావరణం లక్ష్యంగా పల్లె ప్రజలకు దూర ప్రాంతాలకు వెళ్ళకుంగా ఆ గ్రామములో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే గత ప్రభుత్వం కంకణం కట్టుకుంది.అందుకు పల్లె ప్రకృతి వనం ఏర్పాటుకు ప్రతి గ్రామములో ప్రభుత్వ స్థలం ఉన్న చోట, అసలు స్థలం లేని చోటకూడా దాతల సహాకారంతో కావాల్సిన స్థలాన్ని సేకరించి ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది . ఈస్థలాలలో ఆకర్శనీయమైన పూల మొక్కలు, ఫలాలు, నీడను అందించే మొక్కలు, భవిష్యత్లో ఆర్థికమూలాలు అందించే ఎర్రచందనం, టేకు, ఆయుర్వేద మూళికలు సంబందించి మొక్కలు, వాకింగ్ చేయడానికి రెలింగ్ మార్గం, కూర్చోడానికి సిమెంట్ బెంచీలు, గుర్తు పట్టుకోవడానికి దిక్సూచి బోర్డులను రూ. లక్షలు వెచ్చించి నందనవనాలుగా 'పల్లె ప్రకృతి వనాలను రూపొందించింది అప్పటి ప్రభుత్వం.అంతేకాకుండా ఈ మొక్కలను సంవరక్షణ భాద్యతలో కూడా గ్రామ పంచాయతీ, అధికారులు సామూహికంగా పాలుపంచుకుంది. అందుకోసం గ్రామ పంచాయతీ ఆద్వర్యంలో 15వ, ఆర్థిక సంఘం నిధులు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ నిధులు, జీపీ నిధులలో అవసరమైనప్పుడల్లా వెచ్చించి ప్రకృతి వనాల సంవరక్షణ, కోసం మొక్కల కోనుగోలుతో పాటు నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం, చుట్టు పెన్సింగ్ ఏర్పాటు చేశారనాటి ప్రభుత్వం హాయంలో పల్లె ప్రకృతి వనాలకు సరిపడనిధులు, మొక్కలు ఏర్పాటు, పోషణ కోసం శ్రమ ఈపథకం ప్రారంభం నుంచి అన్ని పుస్కలంగా సమకూరాయి. అయితే పల్లె ప్రకృతి వనాల నిర్వహణ కోసం మండలంలోని 29 గ్రామాలలో ఉపాధిహామీ పథకం కింద కూలీలకు రూ.35.92 లక్షలు, అలాగే మెటీరియల్ వరక్స్ కోసం రూ.22.07లక్షలు ఖర్చు చేసింది అప్పటి ప్రభుత్వం.అంతేకాకుండా ఆయా పల్లె వనాలలో సుమారు 53వేల మొక్కలు నాటగా పచ్చని పల్లెలకు చూడ ముచ్చడగా నిలిచాయి ఈ పల్లె వనాలు. నేడు నిధులు లేక కనీసం పోషణ, పట్టింపు లేక పోయింది.ఒక ప్రభుత్వం ఓపథకాన్ని తీసుకువస్తే ఏ ప్రభుత్వం వచ్చినా తీసి వేయకుండా కొనసాగుతుంటాయో ఈ పల్లె ప్రకృతి వనాల సంవరక్షణ కోసం దీర్ఘకాలిక ప్రణాళికలకు లేక పోవడంతో గ్రామాలలోనే కాదు పట్టణాలలో ప్రకృతి వనాలు 'మసక' బారుతున్నాయని చెప్పవచ్చు.

# సార్ సైలెన్స్ వెనుక స్ట్రాటజీ..

మెదక్, జూన్ 2 బీఆర్ఎస్. కేసీఆర్ సారథ్యంలో నడుస్తున్న ఆ పార్టీ అధికారంలో ఉన్నా..అపోజిషన్లో ఉన్నా..25 ఏళ్లుగా లైమ్లైట్లో ఉంటూ వస్తోంది. 14 ఏళ్ల పోరాటం, 10 పదేళ్ల అధికారమంతా..బీఆర్ఎస్, కేసీఆర్ చుట్టే తిరిగింది. ఇప్పుడు ఏడాదిన్నరగా అసలు సిసలు అపోజిషన్ రోల్లో ఉన్న బీఆర్ఎస్ సెంట్రిక్గానే రాష్ట్రంలో రాజకీయ రచ్చ నడుస్తోంది. కాకపోతే ఇప్పుడు బీఆర్ఎస్ కాస్త క్లిష్టమైన పరిస్థితులను ఫేస్ చేస్తోంది. అధికార పక్షం నుంచి కేసులు, ఆరోపణల బెడద ఓ వైపు ఉంటే..పార్టీలో ఇంటర్నల్ రచ్చ కాకరేపుతోంది. అయితే ఏం జరిగినా..ఎంత పెద్ద రచ్చ జరుగుతున్నా రెస్పాండ్ కాకపోవడం మాత్రం చర్చకు దారితీస్తోంది.కవిత లెటర్ రాశారు. ఆ లేఖ బయటికి వచ్చింది. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ కోవర్టులు, దెయ్యాలన్న ప్రస్తావన తెచ్చారు. అంతటితో ఆగకుండా మీడియాతో చిట్చాట్లో కేటీఆర్ను టార్గెట్ చేస్తూ నాతో పెట్టుకోవద్దంటూ వార్నింగ్ ఇచ్చారు.పైగా బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కుట్ర అన్నారు..అయినా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం స్పందించడం లేదు. ఇది ఒక్కటే కాదు చాలా విషయాల్లో కేసీఆర్ మౌనంగానే ఉంటూ వస్తున్నారు. ఏ విషయంలోనూ ఆయన పెద్దగా రెస్పాండ్ కావడం లేదు. పార్టీలో ఇంత హడావుడి నడుస్తున్నా ఆయన ఎందుకు రియాక్ట్ కావడం లేదో ఆ పార్టీ నేతలకు అస్సలు అంతు చిక్కడం లేదట.కూతురు కవిత లిక్కర్ కేసులో విచారణ ఎదుర్కోవడం, తీహార్ జైలుకు వెళ్లి రావడం జరిగినా కేసీఆర్ పెద్దగా స్పందించలేదు. కేటీఆర్ ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ, ఈడీ విచారణను ఫేస్ చేశారు. ఇప్పుడు మరోసారి ఆయనకు ఏసీబీ నుంచి పిలుపొచ్చింది. ఎప్పటిలాగే కాళేశ్వరం కమిషన్ నోటీసులు, విచారణపై కూడా కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదు కేసీఆర్మొన్నా మధ్య వరంగల్లో నిర్వహించిన పార్టీ సిల్వర్ జూబ్లీ సభలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన కేసీఆర్ మళ్లీ ఫాంహౌస్కే పరిమితం అయ్యారు. ఏడాదిన్నర కాలంగా ప్రతిపక్ష నేతగా కేసీఆర్ మౌనంగానే ఉంటున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్నప్పటి కంటే అపోజిషన్లో ఉన్నప్పుడే స్ట్రాంగ్ వాయిస్ వినిపిస్తుంటారు లీడర్లు. పైగా ప్రధాన పక్ష పార్టీ అధినేత, లీడర్ ఆఫ్ అపోజిషన్ అంటే రెగ్యులర్ ప్రెస్మీట్లు, అధికారాన్ని కార్నర్ చేయడం వంటివి ఉంటాయి.అలాంటిది ప్రతిపక్షంలోకి వచ్చినప్పటి నుంచి మౌనంగా ఉంటూనే అంతా నడిపించుకుంటూ వస్తున్నారు కేసీఆర్. అయితే ఇప్పటివరకు ఎలా ఉన్నా ఇప్పుడు మాత్రం కేసీఆర్ మాట్లాడాల్సిన అవసరం ఉందంటున్నారు పార్టీ నేతలు. కవిత లెటర్, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ ఆమె చేసిన ఆరోపణలు, ఆ తర్వాత జరిగిన పరిణామాలు అన్నింటిపై కేసీఆర్ మాట్లాడితేనే అన్నింటికి తెరపడుతుందన్న అభిప్రాయం గులాబీ లీడర్ల నుంచి వినిపిస్తోంది.

# కేబినెట్ లో ఎర్త్...బెర్త్...

విజయవాడ, జూన్ 2, కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. జూన్ 4 నాటికి కూటమి ఏడాది పాలన పూర్తి చేసుకోనుంది. గత ఏడాది జూన్ 4న ఫలితాలు వచ్చాయి. టిడిపి కూటమి సూపర్ విక్టరీ సాధించింది. అయితే అభివృద్ధి పనులపై ఫుల్ ఫోకస్ పెట్టింది. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ నెలలోనే రెండు కీలక పథకాలకు శ్రీకారం చుట్టనుంది. అయితే రాజకీయంగా పట్టు పెంచుకునేందుకు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవులను ప్రకటించింది. అయితే ఇప్పుడు ఏడాది పాలన సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇంకా పెండింగ్లో ఉన్న నామినేటెడ్ పదవులతో పాటు మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మెగా బ్రదర్ నాగబాబుకు మంత్రి పదవి పై హామీ ఇచ్చారు. ఒకవేళ మంత్రివర్గ విస్తరణ జరిగితే నాగబాబు తో పాటు బిజెపి ఎమ్మెల్యే ఒకరికి క్యాబినెట్లో అవకాశం కల్పించే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.రాజ్యసభ పదవుల భర్తీ సమయంలో నాగబాబుకు సర్దుబాటు చేయలేకపోయారు. ఆ సందర్భంలో ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రకటన చేశారు. మెగా బ్రదర్ నాగబాబును రాష్ట్ర క్యాబినెట్లోకి తీసుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్టుగానే నాగబాబు ఎమ్మెల్సీ అయ్యారు. కానీ ఇంతవరకు ఆయనకు మంత్రి పదవి ప్రకటించలేదు. ఎప్పుడు అనేది ఇంతవరకు స్పష్టత రావడం లేదు. అయితే ఇప్పుడు ఏడాది పాలన పూర్తవుతున్న తరుణంలో కొందరు మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మంత్రివర్గ ప్రక్షాళన తప్పదని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మారుతున్న

## పది రోజుల్లో విస్తరణ...

లెక్కలతో మంత్రివర్గ ప్రక్షాళన తప్పదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సీఎం చంద్రబాబు సైతం ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచిస్తున్నారు. అయితే కొందరి మంత్రుల పనితీరులో మార్పు రాకపోవడంతో వారిని మార్చేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం రాష్ట్ర క్యాబినెట్లో ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. 25 మంది మంత్రులకు గాను 24 మంది మాత్రమే ఉన్నారు. ఖాళీగా ఉన్న ఆ స్థానాన్ని నాగబాబుతో భర్తీ చేస్తారు. అదే సమయంలో బిజెపికి మరో మంత్రి పదవి కేటాయించాలన్న డిమాండ్ వస్తోంది. ఇప్పటికే కేంద్రంలో తెలుగుదేశం పార్టీకి రెండు మంత్రి పదవులు కేటాయించారు. ఈ లెక్కన ఏపీలో కూడా బిజెపికి మరో మంత్రి పదవి ఇవ్వాలని కేంద్ర పెద్దలు కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు బిజెపికి మంత్రి పదవి ఇవ్వాలంటే ఒక మంత్రి ఉద్వాసన ఖాయం. అయితే ఒకరినే మంత్రి పదవి నుంచి తొలగిస్తే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పనితీరు బాగాలేని ఓ ముగ్గురు నుంచి ఐదుగురు మంత్రులను తొలగిస్తే.. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం ఇవ్వొచ్చని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే అనవసరంగా తేనె తుట్టను కదుపుతారా? అన్నది ఒక అనుమానమే.పనితీరు బాగా లేకపోవడంతో.. మహానాడు విజయవంతంగా పూర్తయింది. టిడిపి శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో ఓ ముగ్గురు మంత్రులను తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. వారి పనితీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని తెలుస్తోంది. ఇంతకుముందే సీఎం చంద్రబాబు పలుమార్లు వారిని హెచ్చరించినట్లు సమాచారం. ముఖ్యంగా గోదావరి జిల్లాకు చెందిన ఓ మంత్రి పనితీరు అస్సలు బాగోలేదని.. ఆయనపై వివాదాలు నడుస్తున్నాయని ప్రచారం సాగుతోంది. ఇంకోవైపు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఓ మంత్రి సైతం పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నారని తెలుస్తోంది. ఈ జాబితాలో రాయలసీమ జిల్లాకు చెందిన ఓ మంత్రి కూడా ఉన్నారని సమాచారం. అయితే టీడీపీలో చాలామంది ఆశావహులు ఉన్నారు. అనవసరంగా ఇప్పుడు మంత్రి పదవులను గెలికితే అసలుకే ఎసరు వస్తుందన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. అందుకే సీఎం చంద్రబాబు ఆచితూచి నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఏపీలో బంగారం గనులు

కర్నూలు, జూన్ 2 ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజాల అన్వేషణకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నోటిఫైడ్ ప్రైవేట్ ఏజెన్సీలను ఖనిజాన్వేషణకు ఆహ్వానిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలో సున్నపురాయి, మాంగనీస్, బంగారం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని ఉపయోగించుకుంటే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయంటున్నారు. విజయవాడలో కేంద్ర గనుల శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన సదస్సులో ఖనిజాన్వేషణ, వెలికి తీయడం, వేలం సహా పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఖనిజ నిల్వల వెలికితీతపై చర్చ జరిగింది. మైనింగ్ ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం సహకరిస్తుందని.. రాష్ట్రంలో ఖనిజాల అన్వేషణకు నోటిఫైడ్ ప్రైవేట్ ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఖనిజాలను వాటిని ఉపయోగించుకుంటే పరిశ్రమల ముఖచిత్రం మారుతుందని వ్యాఖ్యానించారు.కేంద్ర గనుల శాఖ నిర్దేశించిన స్టేట్ మైనింగ్ రెడీనెస్ ఇండెక్స్‌లో ఏపీ మూడింట్లో 'ఏ' కేటగిరీలో నిలిచిందన్నారు మంత్రి కొల్లు రవీంద్ర. మైనింగ్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉద్యోగాలు వస్తాయని.. ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఏపీలో ఖనిజాల అన్వేషణ, వాటిని వెలికితీయడంపై జీఎస్ఐ, ఐబీఎం, ఎంఈసీఎల్‌తో కలిసి సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎంఈసీఎల్ డైరెక్టర్ పంకజ్ పాండే, జీఎస్ఐ డైరెక్టర్ సత్యనారాయణ మహాపాత్రో, ఐబీఎం కంప్ట్రోలర్ ఆఫ్ మైన్స్ శైలేంద్ర కుమార్‌లు పాల్గొన్నారు. ఎగువ సీలేరులో 1,350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు సీఎస్ విజయానంద్ తెలిపారు. ఏపీ జెన్‌కో ప్రాజెక్టులపై ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయం ఉండాలని ఆయన అన్నారు. అటవీ భూముల అనుమతుల కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కమలపాడు, యాగంటి, రాజుపాలెం, అరవేటిపల్లి, గడికోత, దిన్నేపల్లి ప్రాంతాల్లో పీఎస్‌పీ ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి 14 శాతం పెరిగిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలకు తగ్గట్టుగా వనరులను అభివృద్ధి చేయాలన్నారు. జెన్‌కో చేపట్టిన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. 2027 జనవరి నాటికి పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు పూర్తవుతుందని జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు.

# టెన్త్ వాల్యుయేషన్ లో తీవ్రమైన లోపాలు

విజయవాడ, జూన్ 2,ఆంధ్రప్రదేశ్‌లో 2025 మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో వాల్యుయేషన్ లో తీవ్రమైన లోపాలు వెలుగులోకి వచ్చాయి. ఫలితంగా పాఠశాల విద్యాశాఖ అప్రమత్తమై చర్యలకు ఉపక్రమించింది. తొలిసారిగా, ఘోరమైన తప్పిదాలకు పాల్పడిన ఐదుగురు మూల్యాంకనాధికారులను సస్పెండ్ చేసినట్లు అధికారికంగా ప్రకటించింది.ఈసారి గూఅ పరీక్షల ఫలితాలపై అనేక సందేహాలు తలెత్తడంతో విద్యార్థులు భారీగా రివాల్యుయేషన్, రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 66,363 స్క్రిప్టులపై దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 64,251 రీవాల్యుయేషన్, కాగా 2,112 రీకౌంటింగ్ దరఖాస్తులు ఉన్నాయనేది స్వయంగా విద్యాశాఖ విడుదల గణాంకాలు చెబుతున్నాయి. ఈ స్క్రిప్టులలో 11,175 స్క్రిప్టుల్లో మార్కుల లోపాలు గుర్తించినట్లు తెలుస్తోంది. అంటే సుమారుగా 18% తేడాలు తేలాయి. మిగతా 55,188 స్క్రిప్టుల్లో ఎటువంటి మార్పులు రాలేదు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒక ఉదాహరణ మరింత కలకలం రేపింది. ఓ విద్యార్థిని అన్ని సబ్జెక్టులలో 90కి పైగా మార్కులు సాధించగా, సోషల్ సబ్జెక్టులో కేవలం 23 మార్కులు రావడంతో ఆమె రీవాల్యుయేషన్ కు దరఖాస్తు చేసింది. రీవాల్యుయేషన్ ఫలితాలలో అదే సోషల్ సబ్జెక్టులో ఆమెకు 96 మార్కులు వచ్చాయి. ఆమె మొత్తం మార్కులు 575/600గా నమోదయ్యాయి. ఈ విషయం బయటకు రావడంతో, మిగతా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. దీంతో రీవాల్యుయేషన్ కోసం ముందుకు వచ్చారు.తేలిన లోపాలు విధాన పరమైన వైఫల్యాలురీవాల్యుయేషన్ ప్రక్రియలో గుర్తించిన లోపాలు:టోటలింగ్ లోపాలు: మార్కుల మొత్తాన్ని తప్పుగా లెక్కించడం.ఓఎంఆర్ లో మార్కుల నమోదు లోపం: స్క్రిప్ట్‌లో ఇచ్చిన మార్కులు ఓఎంఆర్ షీట్‌లో తప్పుగా మార్పిడి.మార్కులు ఇవ్వకపోవడం: కొన్ని సరైన సమాధానాలకు మార్కులు ఇవ్వకపోవడం లేదా శూన్యంగా ఉండిపోవడం.ఇన్ని లోపాలు ఉన్నా మూడు స్థాయిల పర్యవేక్షణ వ్యవస్థ, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు , చీఫ్ ఎగ్జామినర్లు ? వాటిని గుర్తించడంలో విఫలమైంది. ఇది వ్యవస్థపై విశ్వాసాన్ని కుదిపేసింది.విద్యాశాఖ ఈ సందర్భాన్ని శిక్షణగా తీసుకుని, ముందుకు ఈ లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటోంది. 2026 నుండి నిర్వహించనున్న గూఅ పరీక్షలలో ఓఎంఆర్ డిజైన్ మార్చడం, మూడు స్థాయిల పర్యవేక్షణను మరింత కఠినతరం చేయడం, తప్పుల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం వంటి చర్యలను తీసుకోవాలని నిర్ణయించింది.

# ఆ మూడు శాఖలపైనే జనసేన దృష్టి

విజయవాడ, జూన్ 2, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమ పార్టీకి కేటాయించిన మూడు శాఖలపై మాత్రం ఫోకస్ పెట్టారు. ఉప ముఖ్యమంత్రిగా మిగిలిన శాఖలను ఆయన ఇటీవల కాలంలో పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఏర్పాటయిన తొలినాళ్లలో హోంశాఖపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అప్పుడు సంచలనమే అయ్యాయి. హోంమంత్రికి చేతకాకుంటే తాను ఆ శాఖను తీసుకోవాల్సి వస్తుందని కూడా అని ఆయన ఒకరకంగా టీడీపీకి కేటాయించిన శాఖలపై కూడా కాస్త కటువుగానే వ్యవహరించేవారు. కానీ గత కొద్ది రోజుల నుంచి మాత్రం తమ పార్టీకి కేటాయించిన శాఖల పర్యవేక్షణకు మాత్రమే పరిమితమయినట్లు కనిపిస్తుంది. మిగిలిన శాఖల జోలికి ఆయన పోవడం లేదు.ప్రధానంగా తాను నిర్వహిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు అటవీ శాఖపై కూడా ఇప్పటికే పట్టు సంపాదించిన పవన్ కల్యాణ్ స్థానిక సంస్థలకు నిధులను విడుదల చేయడంలో సక్సెస్ అయ్యారు. గ్రామీణ రహదారులను మెరుగుపర్చేందుకు కూడా నిధులను కేటాయించారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి సదుపాయాన్ని కల్పించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాలను కూడా రాష్ట్రానికి తీసుకు వచ్చి గ్రామీణాభివృద్ధి పాలనలో గతంలో ఎన్నడూ రాని విధంగా నిధులు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ నేతలతో ఉన్న సత్సంబంధాలతో మెరుగ్గా నిధులను రాష్ట్రానికి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇక తన పార్టీకి చెందిన కందుల దుర్గేష్ కు పర్యవేక్షిస్తున్న సినిమాటోగ్రఫీ, టూరిజంపైన కూడా పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా సినీ థియేటర్లలో బంద్ కు ఎగ్జిబిటర్లు పిలుపు నిచ్చిన తర్వాత పవన్ కల్యాణ్ స్వయంగా రంగంలోకి దిగారు. థియేటర్లలో సోదాలు, దాడులు చేయిస్తూ ఆహార పదార్థాల ధరలను తగ్గించేలా చర్యలు తీసుకున్నారు. తన సినిమా హరిహర వీరమల్లు రిలీజ్ కు ముందు ఈ బంద్ నిర్ణయం పై ఆగ్రహంతో పవన్ ఈ దాడులు చేయిస్తున్నారన్న విమర్శలు వినిపించినప్పటికీ థియేటర్లలో ఆహార వస్తువుల ధరలు పది నుంచి ఇరవై శాతానికి తగ్గిస్తూ యాజమాన్యాలు నిర్ణయం తీసుకోవడంతో పవన్ చర్యల వల్లనేనని ప్రజలు భావిస్తున్నారు.

మరో ముఖ్యమైన శాఖ పౌర సరఫరాల శాఖ. ఈ శాఖ చాలా కీలకమైనది కూడా. పేదలతో నిత్యం టచ్ లో ఉండే శాఖ కావడంతో పవన్ దీనిపై కూడా దృష్టిపెట్టారు. పవన్ కల్యాణ్ నేరుగా రంగంలోకి దిగి రేషన్ దుకాణాలను ఈ రోజు నుంచి రెండు పూటలా నిర్వహించేలా ఆదేశాలు విడుదల చేయించగలిగారు. అంతేకాదు ఆదివారం కూడా రేషన్ సరుకులు ఇవ్వాలని తెలిపారు. రేషన్ ను గత ప్రభుత్వం వాహనాల ద్వారా అందచేయడం వల్ల ఎక్కువగా దుర్వినియోగం అవుతుందని, అందుకే రేషన్ దుకాణాల ద్వారానే పంపిణీ చేయాలని నిర్ణయించడం వెనక కూడా పవన్ కల్యాణ్ ఆలోచన ఉంది. రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు నూనె, పప్పు వంటి వస్తువులను కూడా చౌకగా సరఫరా చేయాలని నిర్ణయించారు.మొత్తం మీద పవన్ కల్యాణ్ మూడింటిపైనే దృష్టి పెట్టినట్లు కనిపిస్తుంది. తమకు అప్పగించిన శాఖల్లో వైఫల్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచనగా ఉంది.

# ఒకేసారి 3 లక్షల మందికి లబ్ది

విజయవాడ, జూన్ 2 ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి సర్కారు ఏర్పాటై.. మరికొన్ని రోజుల్లో ఏడాది పూర్తి కానుంది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని రేంజులో ఘన విజయం అందుకుంది ఎన్డీఏ కూటమి. మొత్తం 175 స్థానాలకు గానూ.. 164 చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో తిరుగులేని మెజారిటీతో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జూన్ 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్, మంత్రులుగా నారా లోకేష్ సహా కీలక నేతలు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. అయితే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి వచ్చే జూన్ 12తో ఏడాది పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఏపీలో ఎన్డీఏ కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తైన సందర్భంగా కొత్తగా నిర్మించిన 3 లక్షల ఇళ్లను ప్రారంభించి.. గృహప్రవేశాలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు జూన్ 12వ తేదీని ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. మూడు లక్షల మంది పేదలకు ఇళ్లను అందించి.. అదేరోజు వారితో గృహప్రవేశాలు చేయించేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూన్ 12 వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మూడు లక్షల ఇళ్లల్లో ఇప్పటి వరకూ 1.70 లక్షలు పూర్తికాగా.. మరో 60 వేల ఇళ్లు తుది దశలో ఉన్నాయి.

# బేగంపేటలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు.

కమాన్ పూర్,రామగిరి మండలంబేగంపేట గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ జెండా వద్ద సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ (అవతరణ) దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాసరి శివ మాట్లాడుతూ అమరుల త్యాగ ఫలితం నాటి యూపీఏ చైర్పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ నిర్ణయం మంత్రి శ్రీధర్ బాబు పదవుల త్యాగం కారణంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు.స్వరాష్ట్రం తెలంగాణలోని తొలి పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం విధ్వంసమైందని తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో సామాజిక తెలంగాణ సాకారదిశగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం జరుగుతుందని దాసరి శివ తెలిపారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మలిదశ ఉద్యమంలో తన మంత్రి పదవులకు రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి శ్రీధర్ బాబు అని నాడు ప్రజల కోసం మాజీ స్పీకర్ శ్రీపాదరావు రక్తాన్ని చిందించి ప్రాణ త్యాగం చేస్తే స్వరాష్ట్రం కోసం తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చడం కోసం ఉమ్మడి రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు మంత్రి పదవులకు రాజీనామా చేయడం వారి త్యాగానికి నిదర్శనమని దాసరి శివ తెలిపారు.నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి శ్రీధర్ బాబు మేధోమధనం చేస్తూ అటు రాష్ట్రాన్ని ఇటు మంథని నియోజకవర్గాన్ని వాయువేగంతో అభివృద్ధి చేస్తున్నారని దాసరి శివ పునరుద్ఘాటించారు.కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కల్వల శంకర్ సీనియర్ నాయకులు దాసరి శివ మాతంగి కుమార్ (కుమార్ ఆర్ట్స్) దుర్గి కొమురయ్య ఇల్లందుల కరుణాకర్ కెక్కర్ల శ్రీనివాస్ ఇల్లందుల సతీష్ బాలసాయి ట్రేడర్ బర్పటి మల్లయ్య ఇల్లందుల సతీష్ (కంగన్ హాల్) వెంకటేష్ బాణాల వీరాచారి గోవిందుల కొమురయ్య కోండ్ర సారయ్య నాంపల్లి తిరుపతి రేగళ్ల భరత్ అంకతి కుమార్ బర్పటి కొమురయ్య బొంతల రవి బుర్ర సారయ్య నాంపల్లి రవితేజతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శైలం ప్రాజెక్టుకు పొంచి ఉన్న ప్రమాదం

కర్నూలు, జూన్ 2, తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం డ్యామ్‌కు పెద్ద ప్రమాదం పొంచి ఉందని నిపుణులు చెబుతున్నారు. గతంలోనే పలు నిపుణుల బృందాలు, ప్యానళ్లు, కమిటీలు డ్యామ్‌ను పరిశీలించాయి. శ్రీశైలం ప్రాజెక్టు గేట్ల నుంచి నీరు కిందపడే ప్రాంతంలో భారీ గుంత ఏర్పడి.. అది అంతకంతకూ పెరిగి పునాదులు బయటపడే వరకు వెళ్లింది అంటున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ శ్రీశైలం డ్యామ్ దుస్థితిపై గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది. అసలు శ్రీశైలం డ్యామ్ ఎందుకు ప్రమాదంలో చిక్కుకుంది?.. ఎలా ఆ సమస్యను ఎలా పరిష్కరించాలనే చర్చ జరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్ట్ దగ్గర ప్లంజ్‌పూల్ గుంత పెద్దది కావడం వల్ల డ్యామ్‌కు ప్రమాదం పొంచి ఉందని నిపుణులు చెబుతున్నారు.డ్యామ్ దగ్గర నీరు భూమిని కోసుకుంటూ వెళ్లడంతో.. డ్యామ్ అడుగు భాగానికి కూడా ఆ గుంత వ్యాపిస్తుందని.. దాని వల్ల డ్యామ్ పునాదులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందంటున్నారు. ఇలా శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్ద ప్రమాదం పొంచి ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెబుతోంది. శ్రీశైలం డ్యామ్ స్పిల్‌వే నుంచి గేట్లు ఎత్తి నీళ్లు కిందకు వదిలిన సమయంలో.. ఎత్తైన ప్రదేశం నుంచి నీళ్లు నేలపై పడితే గుంతలా ఏర్పడుతుంది. ఇప్పుడు శ్రీశైలం ప్రాజెక్ట్ దగ్గర కూడా అదే జరుగుతోంది.. శ్రీశైలం డ్యామ్ గేట్లు తెరిచన సమయంలో నీళ్లు పడిన చోట భూమిపై గుంత ఏర్పడి ప్రాజెక్ట్ పునాదుల వరకు వెళుతోంది.. దానిని ప్లంజ్ పూల్ అంటారు. అలా నీళ్లు పడటంతో రివర్ బెడ్‌ను కోసేస్తోంది.. ఆ క్రమంలో గుంత పెద్దదిగగా మరుతుంది. అక్కడ గుంత చాలా లోతు ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.వాస్తవానికి 1980లోనే ఈ సమస్య ఉందని గుర్తించారు.. దాని కోసం యాప్రాన్‌ను రక్షణగా నిర్మించారు. అలాగే ఇబ్బందులు రాకుండా స్టీల్ సిలిండర్లను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటుతో ఎత్తు నుంచి నీళ్లు కిందపడినా భూమి కొట్టుకుపోకుండా ఉంటుంది. కానీ 2009లో వరదలతో ఆ స్టీల్ సిలిండర్లు కూడా కొన్ని కొట్టుకుపోగా.. మరికొన్ని ధ్వంసం అయ్యాయి. ఆ గుంతను సెట్ చేయడానికి, అక్కడ మళ్లీ స్టీల్ సిలిండర్లు పెట్టడానికి, ఆ ప్లంజ్ పూల్ విస్తరించకుండా తక్షణ ఏర్పాట్లు చేయడానికి.. ఎడమ, కుడి వైపుల నది ప్రవాహం ఎక్కువగా వచ్చిన సమయంలో కొండచరియలు విరిగిపడకుండా, కోతకు గురికాకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. గతంలో రిపేర్లకు రెండున్న కోట్లు అడిగితే రూ.40 లక్షలే ఇచ్చారని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెబుతోంది. ప్లంజ్ పూల్ పూర్తిస్థాయిలో రీడిజైన్ చేయాలన్నారు. మోడ్రన్ జియో టెక్నికల్ ఎక్విప్‌మెంట్ ఉండాలని సూచించారు.. ఈ ఎక్విప్‌మెంట్ ఉంటే డ్యామ్‌కు ఇబ్బందులుంటే పసిగట్టి అలర్ట్ చేస్తుంది అంటున్నారు.గతంలోనే ఈ ప్లంజ్‌పూల్ గుంత వల్ల శ్రీశైలం డ్యామ్‌కు ఇబ్బంది ఉందని నిపుణుల బృందాలు హెచ్చరించాయి. అయితే ఇటీవల ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై అధ్యయనం కోసం రూ.14 కోట్లు మంజూరు చేసింది అంటున్నారు. ప్రాజెక్టులోని ప్లంజ్‌పూల్ సమస్యపై అధ్యయనం చేయడానికి సీడబ్ల్యూపీఆర్‌సీకి అనుమతి ఇవ్వాలని ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదిక పంపారు. అలాగే ఇటీవల దీనిపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో చర్చించారు. తెలంగాణ అధికారులు వెంటనే అధ్యయనం చేయించాలని కోరారు.. ఏపీ ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని బోర్డు సూచించింది. ప్రాజెక్టు ఇంజనీర్లు చంద్రబాబు ప్లంజ్‌పూల్ సమస్య, మరమ్మతుల గురించి వివరించారు. దీనిపై ఏపీ ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కేఆర్ఎంబీ సూచించింది. అయితే ఆ తర్వాత ఈ సమస్య పరిష్కారం దిశగా అడుగులుపడలేదు అంటున్నారునిండు కుండలా ప్రాజెక్టులుభారీ వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు పెడుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో?కృష్ణా బేసిన్ లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. జురాల నిండుకుండలా ఉండగా? మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది.కొద్దిరోజులుగా ఏపీకి ఎగువన ఉన్న రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావంతో కృష్ణమ్మ పరుగులు మొదలయ్యాయి. బేసిన్ లో ఉన్న అన్ని ప్రాజెక్టులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ క్రమంలో తెలంగాణ పరిధిలోని జూరాల నిండుకుండను తలపిస్తోంది. జూరాలతో పాటు సంకుశుల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారుజూరాలకు వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో? కొన్ని గేట్లు కొంత మేర పైకి ఎత్తిని నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని కూడా ప్రారంభించారు. ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు.ఇక జూరాల నుంచి కృష్ణమ్మ పరుగులు పెట్టడంతో.. శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో డ్యామ్ లోని నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది ఉదయం రిపోర్ట్ ప్రకారం?. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 826 దాటింది. నీటినిల్వ 46 టీఎంసీలకుగా నమోదైంది. ఎగువ నుంచి 55,999 క్యూసెక్కుల వరద వస్తుండగా?ఔట్ ఫ్లో 800 ఉంది. వరద ప్రవాహం కొనసాగుతున్న క్రమంలో? నీటినిల్వలు మరింత పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.శ్రీశైలం పూర్తి స్దాయి నీటి మట్టం 885 అడుగులుగా ఉంటుంది. ఫలితంగా శ్రీశైలం డ్యామ్ నిండడానికి మరికొన్ని రోజులు పడుతుంది. పూర్తిస్థాయిలో డ్యామ్ నిండాలంటే 885 అడుగులకు నీరు చేరాల్సి ఉంటుంది. పూర్తిస్థాయిలో నిండిన తర్వాత గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఎగువ రాష్ట్రాల్లోనే కాకుండా ఏపీలోనూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో?. శ్రీశైలం ప్రాజెక్ట్ ఈసారి ముందుగానే నిండటం ఖాయంగానే కనిపిస్తోంది.మరోవైపు నాగార్జున సాగర్ లో పరిస్థితి చూస్తే ఇవాళ ఉదయం రిపోర్ట్ ప్రకారం నీటిమట్టం 512.4 గా ఉంది. ఇక 135.78 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్ ఫ్లో 10,176 గా ఉండగా? 10,176 క్యూసెకుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.ఇక పులిచింతల ప్రాజెక్టు వద్ద పరిస్థితి చూస్తే?. 159.77 అడుగుల నీటిమట్టం ఉంది. 25.29 టీఎంసీల నీటి నిల్వ ఉంది.ఇన్ ఫ్లో నిల్ ఉండగా? ఔట్ ఫ్లో 300 క్యూసెక్కులుగా ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండిన తర్వాత? గేట్లు ఎత్తితే పులిచింతలకు భారీగా వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉంటుంది. మరోవైపు ప్రకాశం బ్యారేజీకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది

# కరివేపాకు అని తీసి పారేయకండి.. ప్రయోజనాలు తెలిస్తే అసలే వదిలిపెట్టరు!



ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అటువంటి ఆరోగ్యం కోసం మనం అనేక రకాల ఆకులను మన ఆహారంలో ఉపయోగిస్తూ ఉంటాం. అలా మన ఆహారంలో ఉపయోగించే ఆకులలో కరివేపాకు ఒకటి. కరివేపాకులో బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. దీనిని తినడం వల్ల మన శరీరానికి ఎనలేని ప్రయోజనాలు కలుగుతాయి. కరివేపాకులో బోలెడు పోషకాలు చాలామంది కూరలో వేసిన కరివేపాకును తీసి పక్కన పెడుతూ ఉంటారు. కానీ కరివేపాకును తినటం చాలా మంచిది. అది మనకు చాలా మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కరివేపాకులో బోలెడు పోషకాలు ఉంటాయి. విటమిన్ సి, విటమిన్ ఏ, ఐరన్ వంటి పోషకాలు ఉంటాయి. కరివేపాకు మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. మన జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కరివేపాకుతో డయాబెటిస్ కు చెక్ కరివేపాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన రోగ నిరోధక శక్తిని బాగా పెంచుతుంది. జలుబు, జ్వరం, దగ్గు వంటి అనారోగ్య సమస్యల నుంచి మన శరీరాన్ని కాపాడటానికి కరివేపాకు ఎంతగానో దోహదం చేస్తుంది. ఇక కరివేపాకు డయాబెటిస్ బాధితులకు ఎంతో బాగా పనిచేస్తుంది. కరివేపాకు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి మన ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. జుట్టు పెరుగుదల, చర్మ ఆరోగ్యం జుట్టు రాలడాన్ని నివారించి, మన జుట్టు పెరుగుదలను కరివేపాకు ప్రోత్సహిస్తుంది. కరివేపాకును నిత్యం తినడం వల్ల మన చర్మం కాంతివంతమవుతుంది. చర్మ సంబంధిత సమస్యలను కరివేపాకు నివారిస్తుంది. కరివేపాకు మన జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలను నివారిస్తుంది. కరివేపాకు మన శరీరంలోని ఎముకలను బలోపేతం చేస్తుంది. ।అయితే ఇలా తీసుకుంటే డేంజర్ ఇక కరివేపాకును మనం పచ్చిగా అయినా తినవచ్చు. లేదా కూరలలో వేసుకుని, పచ్చడిగా చేసుకుని, పొడిగా చేసుకుని తినవచ్చు. కరివేపాకు పొడిని నీటిలో వేసుకుని మరిగించి తాగవచ్చు. అయితే కరివేపాకు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది. అతిగా సేవించడం మాత్రం అనర్థాలకు దారితీస్తుంది. కనుక కరివేపాకును అతిగా తీసుకోవడం మంచిది కాదు. కరివేపాకును మితంగా తీసుకుంటే అది మనకు మంచి ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది.

# ఎండుచేపలు, పచ్చి చేపలు..ఏవి మంచివి?



చాలామంది చేపలను ఇష్టంగా తింటారు. చేపలు ఆరోగ్యానికి ఎంతో మంచిది. చేపలలో ఎండు చేపలు, పచ్చి చేపలు అనే రెండు రకాలు ఉంటాయి. అయితే ఏ చేపలు ఆరోగ్యానికి ఎక్కువ మంచిది? ఎండు చేపలు తింటే మంచిదా? పచ్చి చేపలు తింటే మంచిదా? అనే ప్రశ్నలు చాలామందికి ఉత్పన్నమవుతుంటాయి. ప్రస్తుతం మనం ఏ చేపలు తింటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందో తెలుసుకుందాం. ఎండు చేపలు తినేవారి శాతం ఇంతే ఎండు చేపలు, పచ్చి చేపలలో ఏ చేపలు తిన్నా మంచిదే. అయితే భారతదేశంలో చాలా మంది చేపలు తినే అలవాటు ఉన్నవారిలో 90 శాతం మంది పచ్చి చేపలు తింటే, 10 శాతం మంది మాత్రమే ఎండు చేపలు తింటారు. ఎండు చేపల నుంచి వచ్చే వాసన చాలామంది ఇష్టపడరు. ఈ కారణంగానే చాలామంది ఎండి చేపల కంటే పచ్చి చేపలను ఇష్టంగా తింటారు. పచ్చి చేపల కంటే ఎండు చేపలలో ప్రోటీన్ అధికం ఇక ఎండు చేపలు, పచ్చి చేపలలో ఒకే తరహా పోషకాలు ఉంటాయి. కాకపోతే పచ్చి చేపలలో 18 నుండి 20 శాతం ప్రోటీన్ ఉంటే ఎండు చేపలు 60 శాతం వరకు ప్రోటీన్ ఉంటుంది. పచ్చి చేపలలో 60 శాతం నుంచి 80 శాతం వరకు నీరు ఉంటుంది. ఈ నీటి శాతం ఎక్కువగా ఉన్న కారణంగా పచ్చి చేపలు త్వరగా పాడవుతాయి. ఎండు చేపలలో పచ్చి చేపలలో కంటే 600గ్రాముల ప్రోటీన్ ఇక ఎండు చేపలలో నీరు ఎక్కువగా ఉండదు, కాబట్టి ఎండు చేపలు ఎక్కువకాలం నిల్వ ఉంటాయి. ఆరు నెలల పాటు ఎండు చేపలను నిలువ చేసుకోవచ్చు. అలా నిల్వ చేసినప్పటికీ ఎండు చేపల రుచిలో ఏమాత్రం తేడా రాదు. ఒక కేజీ పచ్చి చేపలో 200 గ్రాముల ప్రోటీన్ లభిస్తే, ఒక కేజీ ఎండు చేపల 600 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. 5 రెండు చేపలలోనూ ఫుల్ పోషకాలు పోషకాల పరంగా చూస్తే ఎండు చేప, పచ్చి చేపల కంటే చాలా మంచి ఫలితాలను ఇస్తాయని చెప్పవచ్చు. ఇక ఎండు చేపలలోనూ, పచ్చి చేపలలోనూ, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో పాటు, విటమిన్ ఏ, విటమిన్–డి, విటమిన్ కె, విటమిన్ బి12 పుష్కలంగా ఉంటాయి. అంతేకాదు జింక్, మెగ్నీషియం, క్యాల్షియం, రాగి ,అయోడిన్, సెలీనియం వంటి పోషకాలు కూడా ఉంటాయి.

# జిమ్ అవసరం లేదు, కఠినమైన డైట్ వద్దు.. దీంతో షాకయ్యేలా వెయిట్ లాస్!

ఊబకాయం.. ప్రస్తుతం సమాజంలో ఇది అతి పెద్ద సమస్య. ఊబకాయంతో బాధపడుతూ బరువు తగ్గడం కోసం చాలామంది రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. బరువు తగ్గడం లేదని తెగ బాధ పడుతూ ఉంటారు. బరువు తగ్గడం కోసం జిమ్ లకు వెళుతూ ఉంటారు. కఠినమైన డైట్ లను చేస్తూ ఉంటారు. కానీ ఎటువంటి ఫలితము రాదు.ఇంట్లోని పదార్థాలతోనే మంచి ఆయుర్వేదిక్ మెడిసిన్అయితే బరువు తగ్గాలని భావించే వారికి చాలా తక్కువ ఖర్చుతో, ఇంట్లోనే ఉండే పదార్థాలతో, బరువును తగ్గించుకోవడానికి ఒక మంచి ఆయుర్వేదిక్ మెడిసిన్ మనమే తయారు చేసుకోవచ్చని చెబుతున్నారు.నేచురల్ పద్ధతిలో మనం మన బరువు తగ్గడానికి ఉదయం లేవగానే పరగడుపున, మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత, రాత్రి పడుకునే ముందు ఒక డిటాక్స్ డ్రింక్ ని తాగితే మంచిదని సలహా ఇస్తున్నారు. మరి అదేమిటో ప్రస్తుతం చూద్దాం.ఈ పొడితో అద్భుతం100గ్రాముల జీలకర్రను, 100గ్రాముల వాము, 100గ్రాముల మెంతులు, మూడు సమపాళ్లల్లో తీసుకుని లైట్ గా వేయించి, అందులో 25గ్రాముల యాలుకలు, 100గ్రాముల సోంపును కలిపి మిక్సీలో వేసి మెత్తని పొడిగా చేసి దానిని ఎయిర్ టైట్ బాటిల్లో పెట్టుకొని, ప్రతిరోజు ఉదయం పరగడుపున నీళ్లలో వేసి మరిగించి తాగితే, అలాగే మధ్యాహ్నం భోజనం తర్వాత, రాత్రి పడుకునే ముందు దీనిని తీసుకుంటే బరువు తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.దీంతో బరువుకు చెక్, షుగర్ నియంత్రణఈ పానీయం కడుపు ఉబ్బరాన్ని తగ్గించడమే కాకుండా జీర్ణ ప్రక్రియను అద్భుతంగా మెరుగుపరుస్తుందని, ఇది శరీరంలో మలినాలను బయటకు పంపడానికి ఎంతో బాగా దోహదం చేస్తుందని చెబుతున్నారు.

# చింతపండును నెల రోజులు పక్కన పెడితే .. శరీరంలో కలిగే అద్భుత మార్పులు ఇవే!




మన తెలుగు వంటకాలలో చింతపండుది ఓ ప్రత్యేక స్థానం. పులుసు, పచ్చడి, పులిహోర, సాంబార్... ఇలా చెప్పుకుంటూ పోతే చింతపండు లేని వంటగదిని ఊహించుకోవడం కష్టమే. ఆ పుల్లపుల్లని రుచి మన నాలుకకు ఎంతగానో నచ్చుతుంది. మరి అలాంటి చింతపండును ఒక్క నెల రోజులు పూర్తిగా పక్కన పెడితే మన శరీరంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయి? ఇది మంచిదా, కాదా? తెలుసుకోవాలనే ఆసక్తి మీకు కూడా ఉందా? అయితే చదివేయండి. చింతపండును నెల రోజుల పాటు తినడం మానేయడం వల్ల కొన్ని సానుకూల, మరికొన్ని గమనించదగ్గ మార్పులు శరీరంలో కనిపించే అవకాశం ఉంది. అవేంటో చూద్దాం: " జీర్ణవ్యవస్థలో మార్పులు: ఎసిడిటీ తగ్గుదల: చాలా మందికి చింతపండు ఎక్కువగా తింటే కడుపులో మంట, గ్యాస్, తేన్పులు వంటి సమస్యలు వస్తుంటాయి. ఇందులో ఉండే ఆమ్ల గుణాలే దీనికి కారణం. ఒక నెలపాటు చింతపండును పూర్తిగా మానేయడం వల్ల, ముఖ్యంగా ఎసిడిటీ సమస్యతో బాధపడేవారికి, ఈ సమస్యల నుంచి గణనీయమైన ఉపశమనం లభించవచ్చు. కడుపు ఉబ్బరం కూడా తగ్గే అవకాశం ఉంది. మలబద్ధకంపై ప్రభావం: చింతపండులో ఉండే సహజ గుణాలు కొంతవరకు మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడతాయి. దీన్ని పూర్తిగా మానేయడం వల్ల కొందరిలో జీర్ణక్రియ వేగం కొద్దిగా తగ్గి, మలబద్ధకం సమస్య తలెత్తే అవకాశం లేకపోలేదు. అయితే, ఇది వ్యక్తిగత జీర్ణశక్తిపై ఆధారపడి ఉంటుంది. పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఇతర ఆహారాలను తీసుకోవడం ద్వారా దీన్ని అధిగమించవచ్చు. 5 5 00:00 / 01:59 రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం: చింతపండును తరచుగా బెల్లం లేదా చక్కెరతో కలిపి వంటకాల్లో వాడతాం (ఉదా: పానకం, కొన్ని పచ్చళ్ళు). ఇలా చక్కెరతో కలిపి తీసుకున్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. చింతపండుతో పాటు ఈ చక్కెరలను కూడా మానేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలపై కొంత సానుకూల ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా మధుమేహం నియంత్రణలో ఉన్నవారికి ఇది మేలు చేయవచ్చు. అయితే, కేవలం చింతపండు మానేయడం వల్ల మాత్రమే భారీ మార్పులు వస్తాయని చెప్పలేం. దంత ఆరోగ్యం మెరుగుపడే అవకాశం: చింతపండులోని ఆమ్ల గుణం (టార్టారిక్ యాసిడ్) దంతాలపై ఉండే ఎనామిల్‌ను కొద్దిగా దెబ్బతీసే అవకాశం ఉంది. తరచుగా, ఎక్కువగా చింతపండు తినేవారిలో దంతాల సున్నితత్వం పెరగవచ్చు. నెల రోజుల పాటు దీన్ని మానేయడం వల్ల దంతాలపై ఈ ఆమ్ల దాడి తగ్గి, దంత ఆరోగ్యం కొంత మెరుగుపడే ఆస్కారం ఉంది. రుచిలో మార్పు: ప్రతిరోజూ చింతపండు రుచికి అలవాటు పడిన నాలుక, దాన్ని మానేయగానే ఆ పుల్లని రుచిని కోరుకోవచ్చు. ఇతర పుల్లని పదార్థాల వైపు మనసు మళ్లే అవకాశం ఉంది. కొంతకాలం తర్వాత, రుచి మొగ్గలు ఈ మార్పుకు అలవాటు పడవచ్చు. శరీరంలో నీటి శాతం: చింతపండులో పొటాషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటంలో సహాయపడతాయి. అయితే, సాధారణంగా మనం తీసుకునే చింతపండు పరిమాణం తక్కువే కాబట్టి, దీన్ని మానేయడం వల్ల శరీరంలోని నీటి శాతంలో పెద్దగా తేడాలు రాకపోవచ్చు. అయితే ఈ మార్పులన్నీ అందరిలోనూ ఒకేలా ఉండవని గుర్తుంచుకోవాలి. మీ జీవనశైలి, ఇతర ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఫలితాలు మారవచ్చు. చింతపండు పూర్తిగా అనారోగ్యకరమైనది కాదు. మితంగా తీసుకుంటే దానిలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. నెల రోజుల పాటు చింతపండు మానేయాలనుకుంటే, మీ ఆహారంలో ఇతర పోషకభరితమైన పదార్థాలు ఉండేలా చూసుకోవడం ముఖ్యం. ఏదైనా ఆహార మార్పులు చేసే ముందు, ముఖ్యంగా మీకు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించడం అత్యంత శ్రేయస్కరం. ఒక నెల చింతపండు మానేయడం వల్ల కలిగే ప్రభావాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయి. ముఖ్యంగా ఎసిడిటీ సమస్యలు ఉన్నవారికి ఇది కొంత ఉపశమనాన్ని ఇవ్వొచ్చు. అయితే, చింతపండు మన సంప్రదాయ ఆహారంలో ఒక భాగం. దాన్ని పూర్తిగా దూరం పెట్టాలా వద్దా అనేది వ్యక్తిగత నిర్ణయం మరియు ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. మీ శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం ఒక ఆసక్తికరమైన ప్రయోగం కావచ్చు, కానీ సమతుల్య ఆహారం, మితమైన వినియోగం ఎల్లప్పుడూ ఆరోగ్యానికి కీలకం అని మర్చిపోకూడదు.

# ఆల్కహాల్‌లో కూల్ డ్రింక్ కలిపి తాగితే గుండె ఆరోగ్యానికి హానికరమా?

పార్టీలైనా, స్నేహితులతో సరదాగా గడిపే సమయమైనా చాలామందికి ఆల్కహాల్ తో పాటు కూల్ డ్రింక్ లేదా సోడా కలుపుకుని తాగడం ఒక అలవాటు. ముఖ్యంగా మద్యం ఘాటైన రుచిని ఇష్టపడని వారు, కొత్తగా తాగడం మొదలుపెట్టిన వారు ఇలా చేస్తుంటారు. కూల్ డ్రింక్ తీపిదనం, రకరకాల ఫ్లేవర్లు మద్యం రుచిని తెలియకుండా చేస్తాయి, తాగడాన్ని సులభతరం చేస్తాయి. కానీ, ఈ కాంబినేషన్ మీ ఆరోగ్యానికి ఎంత హానికరం అనేది ఎప్పుడైనా ఆలోచించారా? కేవలం రుచి కోసం చేసే ఈ పని, తెలియకుండానే అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకు హానికరం? మద్యం మోతాదు తెలియకపోవడం: ఆల్కహాల్‌లో కూల్ డ్రింక్ కలపడం వల్ల అనేక రకాలుగా ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది.వాటిల్లోని తీపి, కార్బొనేషన్ (గ్యాస్), ఫ్లేవర్ల వల్ల ఆల్కహాల్ యొక్క అసలైన రుచిని, ఘాటును మార్చేస్తాయి. దీనివల్ల మీరు ఎంత మోతాదులో మద్యం సేవిస్తున్నారో సరిగ్గా అంచనా వేయలేరు. ఫలితంగా, తెలియకుండానే ఎక్కువ మద్యం తాగేస్తారు. ఇది త్వరగా మత్తు ఎక్కువ అవ్వడానికి, కొన్నిసార్లు ఆల్కహాల్ పాయిజనింగ్ కు దారితీసే ప్రమాదం ఉంది. వేగంగా రక్తంలో కలవడం: చాలా కూల్ డ్రింక్స్ లో కార్బొనేషన్ (గ్యాస్ బుడగలు) ఉంటుంది. ఈ కార్బొనేషన్, కడుపు నుండి ఆల్కహాల్‌ను చిన్న ప్రేగులలోకి వేగంగా పంపిస్తుంది. చిన్న ప్రేగులలో ఆల్కహాల్ శోషణ చాలా వేగంగా జరుగుతుంది. దీనివల్ల ఆల్కహాల్ చాలా త్వరగా రక్తంలో కలిసి, మీరు అనుకున్నదానికంటే వేగంగా, తీవ్రంగా మత్తులోకి జారుకుంటారు. ఇది ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయవచ్చు. అధిక చక్కెర మోతాదు: సాధారణ కూల్ డ్రింక్స్‌లో చక్కెర శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆల్కహాల్‌లో ఇప్పటికే కేలరీలు ఉంటాయి. దీనికి తోడు కూల్ డ్రింక్‌లోని అధిక చక్కెర కలవడం వల్ల శరీరంలోకి అనవసరమైన కేలరీలు భారీగా చేరతాయి. ఇది దీర్ఘకాలంలో బరువు పెరగడానికి, ఊబకాయానికి, టైప్–2 డయాబెటిస్ (మధుమేహం) వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. ' డీహైడ్రేషన్ : ఆల్కహాల్ మూత్రవిసర్జనను పెంచి డీహైడ్రేషన్‌కు కారణమవుతుంది. అలాగే, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు, కెఫిన్ ఉన్న కూల్ డ్రింక్స్, కూడా డీహైడ్రేషన్‌ను పెంచుతాయి. ఈ రెండూ కలిపి తాగినప్పుడు డీహైడ్రేషన్ సమస్య మరింత తీవ్రమవుతుంది. దీనివల్ల మరుసటి రోజు వచ్చే హ్యాంగోవర్ లక్షణాలు (తలనొప్పి, నీరసం) మరింత తీవ్రంగా ఉంటాయి. దీర్ఘకాలంలో కిడ్నీలపై కూడా భారం పడుతుంది. కెఫిన్ - ఆల్కహాల్ విరుద్ధ ప్రభావాలు: కొన్ని కూల్ డ్రింక్స్ కెఫిన్‌ను కలిగి ఉంటాయి. కెఫిన్ ఒక ఉత్తేజపరిచే పదార్థం, ఆల్కహాల్ ఒక నిషామయమైన పదార్థం. ఈ రెండింటినీ కలపడం వల్ల శరీరానికి తప్పుడు సంకేతాలు అందుతాయి. కెఫిన్ మిమ్మల్ని తాత్కాలికంగా చురుకుగా ఉంచడం వల్ల, మీరు ఎంత మత్తులో ఉన్నారో సరిగ్గా గ్రహించలేరు. ఇది మిమ్మల్ని మరింత మద్యం తాగేలా లేదా రిస్కీ ప్రవర్తనలకు పాల్పడేలా ప్రేరేపిస్తుంది. గుండెపై కూడా ఇది అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. డైట్ కూల్ డ్రింక్స్ కూడా సురక్షితం కాదు: చక్కెర లేని డైట్ కూల్ డ్రింక్స్ కలుపుకుంటే ఫరవాలేదు అనుకుంటే పొరపాటే. కొన్ని అధ్యయనాల ప్రకారం, డైట్ డ్రింక్స్‌లోని కృత్రిమ తీపి పదార్థాలు కూడా ఆల్కహాల్ శోషణను వేగవంతం చేయవచ్చని తెలుస్తోంది. కాబట్టి, చక్కెర లేకపోయినా, వేగంగా మత్తు ఎక్కే ప్రమాదం వీటితోనూ ఉంది. మద్యంలో కూల్ డ్రింక్ కలపడం రుచిగా అనిపించవచ్చు, కానీ ఆరోగ్యానికి ఖచ్చితంగా మంచిది కాదు. ఇది తెలియకుండానే ఎక్కువ మద్యం తాగేలా చేయడం, ఆల్కహాల్‌ను వేగంగా రక్తంలో కలిసేలా చేయడం, శరీరంలో చక్కెర



శాతాన్ని పెంచడం, డీహైడ్రేషన్‌కు గురిచేయడం వంటి అనేక సమస్యలకు కారణమవుతుంది. దీర్ఘకాలంలో ఊబకాయం, మధుమేహం, కాలేయ సమస్యలు, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మద్యం సేవించాల్సి వస్తే, దానిని నీటితో లేదా తక్కువ పరిమాణంలో సోడాతో (చక్కెర లేనిది) కలుపుకోవడం కొంతవరకు మేలు. అయితే, అన్నింటికంటే ముఖ్యమైనది మితంగా సేవించడం లేదా పూర్తిగా దూరంగా ఉండటం. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది, బాధ్యతాయుతంగా వ్యవహరించండి!




## కోలీవుడ్ హీరోతో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన హీరోయిన్



సౌత్ స్టార్ హీరోల్లో ఒకడిగా శింబు గత కొన్ని దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాడు. పలు బ్లాక్ బస్టర్ సినిమాలతో ఆడియన్స్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శింబు ఆల్రెడీ 47 సినిమాలు చేశాడు. మరో మూడు సినిమాలు త్వరలోనే ఆడియిన్స్ ముందుకు రానున్నాయి. ప్రస్తుతం కమల్ హాసన్ తో కలిసి మణిరత్నం దర్శకత్వంలో థగ్ లైఫ్ సినిమా చేశాడు. జూన్ 5న థగ్ లైఫ్ ప్రేక్షకుల ముందుకు రానుంది. థగ్ లైఫ్ లో శింబు చాలా కీలక పాత్రలో నటించినట్టు ఆల్రెడీ రిలీజైన ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. యాక్టర్ గా శింబు ఎంత మంచి పెర్ఫార్మర్ అనేది ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అయినప్పటికీ శింబు సినిమాల్లో తన యాక్టింగ్ కంటే తన పర్సనల్ లైఫ్ లో వచ్చే రూమర్ల వల్లే ఎక్కువగా వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. గత కొన్నాళ్లుగా టాలీవుడ్ హీరోయిన్ తో శింబు రిలేషన్‌లో ఉన్నాడని, త్వరలోనే వారిద్దరూ పెళ్లి చేసుకోనున్నారనే వార్త వినిపిస్తుంది. ఆ టాలీవుడ్ హీరోయిన్ మరెవరో కాదు, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్. గతంలో శింబు తో కలిసి నిధి ఈశ్వరన్ అనే సినిమా చేసింది. ఆ సినిమా షూటింగ్ టైమ్ లోనే వీరిద్దరి మధ్యా ఏర్పడిన స్నేహం ప్రేమగా మారిందని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని అన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ఈ వార్తలపై తాజాగా హరిహర వీరమల్లు ప్రమోషన్స్ లో పాల్గొన్న నిధి అగర్వాల్ స్పందించి వివరణ ఇచ్చింది. సినిమాల్లో నటించే హీరోయిన్ల గురించి చాలా పుకార్లొస్తాయని, మరీ ముఖ్యంగా వారి పర్సనల్ లైఫ్ గురించి అందరూ ఎక్కువగా ఫోకస్ చేస్తారని, ఏది అనిపిస్తే దాన్ని బయటకు అనేస్తారని, ఇదంతా చాలా కామన్ అని, ఎందుకంటే జనాలు నిజాల కంటే రూమర్లపైనే ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తారని, అందుకే తాను వాటిని పెద్దగా పట్టించుకోనని, తన గురించి ఎప్పుడూ ఏదో రూమర్ వినిపిస్తూనే ఉంటుందని నిధి తెలిపింది. నిధి మాటలతో తన పెళ్లిపై అందరికీ ఓ క్లారిటీ ఇచ్చేసింది. ప్రస్తుతం నిధి అగర్వాల్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న నిధి, వీరమల్లు పై ఎన్నో ఆశలు పెట్టుకుంది.

## మన నాని.. ఫుల్ ట్రెండింగ్ లో ఉన్నాడుగా!

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని.. బ్యాక్ టు బ్యాక్ మూవీస్ తో సందడి చేస్తున్న విషయం తెలిసిందే. ఓ వైపు హీరోగా దూసుకుపోతూనే.. మరో వైపు నిర్మాతగా రాణిస్తున్నారు. రీసెంట్ గా లీడ్ రోల్ లో నటించిన హిట్ ది థర్డ్ కేస్ తో సూపర్ హిట్ అందుకున్నారు. అదే సమయంలో చిన్న మూవీ కోర్ట్ తో మంచి సక్సెస్ ను సాధించారు. రెండు సినిమాలు.. నెల గ్యాప్ లోనే రిలీజ్ అయ్యి ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ అందుకున్నాయి. అనేక మందిని మెప్పించాయి. బాక్సాఫీస్ వద్ద కూడా భారీ వసూళ్లను రాబట్టాయి. సరికొత్త రికార్డులు క్రియేట్ చేశాయి. నానికి అరుదైన ఘనతలు తెచ్చిపెట్టాయి. ఇప్పుడు ఆ రెండు సినిమాలు కూడా ఓటీటీలోకి వచ్చాయి. ప్రముఖ ఓటీటీ నెట్ ఫ్లిక్స్ లోనే రెండు చిత్రాలు హిట్-3, కోర్ట్ ఇప్పుడు స్ట్రీమింగ్ అవ్వడం గమనార్హం. ప్రస్తుతం అక్కడ కూడా దూసుకుపోతున్నాయి. ఓటీటీలో ట్రెండింగ్ లో ఉన్నాయి. టాప్ లిస్ట్ లో స్థానం సంపాదించుకున్నాయి. నెం.1లో క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ హిట్-3 ఉండగా, కోర్ట్ రూమ్ డ్రామా కోర్ట్ 8వ స్థానంలో ట్రెండింగ్‌లో ఉంది. అలా నానికి సంబంధించిన రెండు సినిమాలు.. ఓటీటీలో ఇప్పుడు సందడి చేస్తున్నాయి. అయితే శైలేష్ కొలను దర్శకత్వం వహించిన హిట్-3లో అర్జున్ సర్కార్ రోల్ పోషించారు నాని. నెవ్వర్ బిఫోర్ అనేలా కనిపించి మెప్పించారు. ఇప్పటివరకు కెరీర్ లో అంత వైలెన్స్ తో ఉన్న పాత్రలో నాని కనిపించడం ఇదే మొదటిసారి. మరోవైపు, కోర్ట్ మూవీలో ప్రముఖ నటుడు ప్రియదర్శి, హర్ష్ రోషన్, శ్రీదేవి కీలక



పాత్రల్లో నటించారు. రామ్ జగదీశ్ దర్శకత్వం వహించగా, తక్కువ బడ్జెట్ తోనే స్పెషల్ గా నాని నిర్మించారు. చిన్న సినిమాల్లో అత్యంత లాభాలు తీసుకొచ్చిన మూవీగా రికార్డు క్రియేట్ చేసింది. ప్రొడక్షన్ వాల్యూస్ పరంగా నానికి ప్రశంసలు వచ్చాయి. కాగా, నాని త్వరలో శ్రీకాంత్ ఓదెలతో వర్క్ చేయనున్నారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పారడైజ్ ను ప్రారంభించబోతున్నారు. మరికొద్ది రోజుల్లో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది. ఆ తర్వాత నటించాల్సిన సినిమాలు ఇప్పటికే లైన్ లో పెట్టేశారు. అటు చిరు- ఓదెల మూవీ సహా పలు ప్రాజెక్టులను నిర్మించనున్నారు. మరి ఫ్యూచర్ లో నాని ఎలాంటి సక్సెస్ లు అందుకుంటారో వేచి చూడాలి.

## హీరోయిన్లను సాధారణ మహిళల్లా చూడట్లేదు



బాల నటిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మలయాళ భామ నిత్య మీనన్ తన మాతృభాషలోనే హీరోయిన్ గా కూడా పరిచయమైంది. మలయాళంతో పాటూ తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో కూడా ఎన్నో సినిమాలు చేసి తనకంటూ మంచి గుర్తింపును తెచ్చుకుంది నిత్యా మీనన్. తన కెరీర్ స్టార్టింగ్ నుంచి ఇప్పటి వరకు ఎంతో సెలెక్టివ్ గా సినిమాలు చేస్తూ వస్తున్న నిత్య మీనన్ అందరిలా కాదు చాలా డిఫరెంట్. ఎక్స్‌పోజింగ్, ఇంటిమేట్ సీన్స్ కు మొహమాటం లేకుండా నో చెప్తూ ఉంటుంది. అయినప్పటికీ అమ్మడికి ఆఫర్లు వస్తున్నాయంటే దానికి తన టాలెంటే కారణం. 180 సినిమాతో కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన నిత్యా ఆ తర్వాత వరుస పెట్టి అక్కడ సినిమాలు చేస్తూ వచ్చింది. మణిరత్నం తో చేసిన ఓకే కణ్మణి సినిమాతో నిత్యా బాగా పాపులరైన విషయం తెలిసిందే. అయితే నిత్య మీనన్ కు కాస్త పొగరు అనే మాట రెగ్యులర్ గా బయట వినిపిస్తూ ఉంటుంది. కొన్నాళ్ల కిందట ఓ ఈవెంట్ కు వెళ్లిన నిత్యామీనన్ కు అక్కడున్న ఓ ఫ్యాన్ షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ట్రై చేసినప్పటికీ నిత్యా మాత్రం అతనికి నమస్కారం చేసి తనకు జలుబు ఉందని చెప్పి లోపలికి వెళ్లి అదే ఈవెంట్ లో అక్కడున్న హీరోకు హగ్ ఇచ్చింది. ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నెటిజన్లు నిత్యామీనన్ ను బాగా ట్రోల్ చేయగా, తాజాగా ఈ విషయంపై నిత్యా క్లారిటీ ఇచ్చింది. చాలా మంది మగాళ్లు హీరోయిన్లను సగటు మహిళల్లాగా భావించరని నిత్యా మీనన్ చెప్పింది. హీరోయిన్లను ఈజీగా టచ్ చేయొచ్చని అనుకుంటారని, తాము ఎలాంటి ఈవెంట్ కు వెళ్లినా షేక్ హ్యాండ్ అంటూ తమను టచ్ చేయడానికి ఎగబడతారని, సాధారణ మహిళలను వాళ్లు షేక్ హ్యాండ్ అడక్కుండా తమను మాత్రమే ఎందుకు అడుగుతున్నారు? అలా ఈజీగా టచ్ చేయడానికి హీరోయిన్లు ఏమైనా ఆట బొమ్మలా అని నిత్యామీనన్ ఫైర్ అయింది. ప్రస్తుతం నిత్యా మీనన్ ఈ విషయంపై రెస్పాండ్ అయి మట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇక నిత్యా కెరీర్ విషయానికొస్తే తిరుచ్చిత్రం ఫలం సినిమాలో ధనుష్ తో కలిసి నటించి ఆ సినిమాలో తన యాక్టింగ్ కు రీసెంట్ గా ఉత్తమ నటిగా నేషనల అవార్డ్ ను అందుకున్న నిత్యా మీనన్ ఇప్పుడు మరోసారి ధనుష్ తో కలిసి ఇడ్లీ కడై సినిమా చేస్తోంది. త్వరలోనే ఇడ్లీ కడై ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో పాటూ విజయ్ సేతుపతితో కలిసి తలైవన్ తలైవి సినిమాలో కూడా నిత్యా నటిస్తోంది.

## మొన్న అలియా భట్.. ఇప్పుడు త్రిష..

నాలుగు పదుల వయసులో కూడా త్రిష చేతినిండా సినిమాలతో కెరీర్లో దూసుకెళ్తుంది. రీసెంట్ గా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీతో సూపర్ హిట్ ను తన అకౌంట్ లో వేసుకున్న త్రిష సుమారు రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో సత్తా చాటుతుంది. మధ్యలో కెరీర్ కు బ్రేక్ వచ్చినప్పటికీ పొన్నియన్ సెల్వన్ తర్వాత అమ్మడి క్రేజ్ పెరిగింది. దీంతో సెకండ్ ఇన్నింగ్స్ లో కూడా త్రిషకు మంచి ఆఫర్లు దక్కుతున్నాయి. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో అనేక సినిమాల్లో నటించిన త్రిష చేతిలో ప్రస్తుతం థగ్ లైఫ్, విశ్వంభర సినిమాలున్నాయి. కమల్ హాసన్ సరసన మణిరత్నం దర్శకత్వంలో త్రిష నటించిన థగ్ లైఫ్ సినిమా రిలీజ్ కు రెడీ అయింది. జూన్ 5న థగ్ లైఫ్ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా పలు ఈవెంట్స్ లో పాల్గొంటున్న త్రిష కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకుంటుంది. మలయాళీ నటుడు ఫహాద్ ఫాజిల్ అంటే తనకు ఇష్టమని, ఆయనతో కలిసి నటించడం తనకు చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. మీరు ఎవరితో నటించాలనుకుంటున్నారని రీసెంట్ గా ఓ సందర్భంలో త్రిషను అడగ్గా అమ్మడు ఫహాద్ ఫాజిల్ పేరు చెప్పింది. ఫహాద్ ఫాజిల్ తో నటించాలనుంది. అతనెలాంటి కథనైనా, ఎలాంటి క్యారెక్టర్‌లో అయినా అద్భుతంగా నటించగలడు. అతను చాలా అద్భుతమైన నటుడు అని మనసులోని మాటను బయటపెట్టింది త్రిష. త్రిష చెప్పినట్టు ఫహాద్ చాలా గొప్ప నటుడు. ఎలాంటి పాత్రనైనా, ఎలాంటి సినిమానైనా




చేయగల కెపాసిటీ ఉన్న యాక్టర్. మొన్నటికి మొన్న అలియా భట్ కూడా ఫహాద్ అంటే ఇష్టమని, కచ్చితంగా అవకాశం వస్తే అతనితో కలిసి నటించడానికి రెడీగా ఉన్నానని చెప్పింది. ఇప్పుడు త్రిష కూడా ఫహాద్ అంటే ఇష్టమని, తనతో కలిసి నటించాలనుందని తెలిపింది. ఇక థగ్ లైఫ్ విషయానికొస్తే ఈ సినిమా నాయగన్ ను మించి ఉంటుందని చిత్ర యూనిట్ మొత్తం ఎంతో గొప్పగా చెప్తుంది. దీంతో పాటూ త్రిష, చిరంజీవితో చేస్తున్న విశ్వంభర సినిమాపై కూడా అందరిక మంచి అంచనాలున్నాయి.



## రాజాసాబ్ : మళ్లీ లీక్.. మరోసారి వైరల్

ప్రభాస్ సలార్, కల్కి 2898 ఏడీ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకున్న నేపథ్యంలో ఆయన నుంచి రాబోతున్న రాజాసాబ్ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా పెరిగాయి. సినిమాను 2025 సమ్మర్‌లోనే విడుదల చేయాలని భావించారు. ఏప్రిల్ నెలలోనే సినిమాను విడుదల చేయాలని భావించినా కూడా సాధ్యం కాలేదు. షూటింగ్ ఆలస్యం కావడంతో పాటు, వీఎఫ్ఎక్స్ వర్క్ ఆలస్యం కావడం వల్ల విడుదల వాయిదా వేశారు. బ్యాలన్స్ షూటింగ్‌ను త్వరలోనే పూర్తి చేసి, ఈ ఏడాది చివరి వరకు ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని భావిస్తున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. ఈ సినిమా నుంచి గతంలోనే ఒక ఫోటో లీక్ అయింది. తాజాగా మరో ఫోటో లీక్ అయింది. ఆ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రభాస్ మాస్ లుక్‌లో ఉన్న ఆ ఫోటోకు మంచి స్పందన వచ్చింది. ఆ ఫోటో క్వాలిటీ లేకున్నా సోషల్ మీడియాలో అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. అంతే కాకుండా ఫ్యాన్ గ్రూప్స్ లో పంచుకుంటూ, ఫోటో గురించి చర్చించుకుంటున్నారు. రఫ్ లుక్‌లో ప్రభాస్ ను చూస్తూ ఉంటే భలే ఉంది అంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉన్నారు. ప్రభాస్‌ను ఇలా చూసి చాలా కాలం అయింది అంటూ అభిమానులు సైతం చర్చించుకుంటున్నారు. మిర్చి తరహా లుక్‌లో ప్రభాస్‌ను చూడటం చాలా సంతోషంగా ఉందని వారు అంటున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆ మధ్య ఈ సినిమా ఆర్థిక పరమైన ఇబ్బందుల కారణంగా ఆలస్యం అవుతూ వస్తోందనే పుకార్లు షికార్లు చేశాయి. కానీ ఈ సినిమాకు ఎలాంటి ఆర్థిక ఇబ్బంది లేదు అంటూ మేకర్స్ చెప్పుకొచ్చారు. సినిమా షూటింగ్ త్వరలోనే పూర్తి చేసి, అతి త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను సైతం పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. దసరా లేదా ఆ తర్వాత అయినా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. రాజాసాబ్ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే విశ్వాసంను ప్రభాస్ ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో హర్రర్ థ్రిల్లర్ సినిమాలకు మంచి రెస్పాన్స్ దక్కుతుంది. హిందీ ఇండస్ట్రీలో కూడా థ్రిల్లర్ సినిమాలకు భారీ వసూళ్లు నమోదు అవుతున్న ఈ సమయంలో రాజాసాబ్ అదే జోనర్ కావడంతో అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా అన్ని చోట్ల మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాలో ప్రభాస్ హీరోగా నటిస్తూ ఉండగా నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంజయ్ దత్ ఈ సినిమాలో ప్రభాస్ తాత పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి త్వరలోనే టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో విడుదల తేదీ విషయమై క్లారిటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.



## మలేరియా మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించిన

- ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ దాత్రి రెడ్డి



ఏలూరు జిల్లా జూన్ 2 ఏలూరు జిల్లా చింతలపూడిలో మలేరియా మాసోత్యవాలు గోడ పత్రికలను,కరపత్రాలను బ్యానర్ లను ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ దాత్రిరెడ్డి ఆవిష్కరించారు.అలాగే ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.మాలిని మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో సీజనల్ వ్యాధుల్లో భాగంగా మలేరియా మహమ్మారి విస్తృతంగా వచ్చే అవకాశం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల విష జ్వరాలు బారిన పడకూడదని వర్షాకాలంలో కాచిన నీరును తాగాలని అలాగే మురుగునీరు ఉన్నచోట్ల శుభ్రం చేసుకోవాలని మలేరియా అంతం మనతోనే సాధ్యం అని అన్నారు.ఈ సమావేశం లో చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్. ఏ.ప్రసాద్, రఘూవాపురం, ఎర్రగుంటపల్లి వైద్యధికారులు కె.నరేష్.,చైతన్య, ఎమ్.పి.హెచ్. ఇ ఓ శ్రీనివారరావు, సూపెర్వైసర్ లు రవి, ప్రమీలకుమారి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పోడూరు గ్రామంలో షాప్ నెంబర్. 9 లో రేషన్ షాపు పునః ప్రారంభించిన పితాని



పోడూరు: జూన్ 2, రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు నిత్యవసర సరుకులు అందించాలని ప్రభుత్వం నిర్ణయం లో భాగంగా పోడూరు మండలం పోడూరు గ్రామంలో షాప్ నెంబర్. 9 లో ఆచంట నియోజకవర్గం శాసనసభ్యులు పితాని సత్యనారాయణ చేతుల మీదుగా రేషన్ షాపు పునః ప్రారంభించి కార్డుదారులకు నిత్యవసర సరుకులు అందజేయడం అయినది.సదరు కార్యక్రమము పండుగ వాతావరణం లో ఎంతో ఉత్సాహంగా జరిగినది. ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు కార్డుదారులతో పాటుగా ప్రజలందరూ పాల్గొని ఉన్నారు.పోడూరుమండల తహసిల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ , రేషన్ పంపిణీకి ఏర్పాటు చేసి ఉన్నారు. ఎంపీపీ సబ్బిత సుమంగళి సాగర్,ఎంపీడీవో మంగ కుమారి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కందుల రాంబాబు, గ్రామ సర్పంచ్ చిట్టే బత్తుల సువర్ణ రాజు, ఎంపీటీసీ పోడూరు నాగరాజు, రవి రాజా,వివిధ శాఖలకు చెందిన అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాలకొల్లుఅమ్మ ఛారిటబుల్ అనాధవృద్ధురాలి మృతదేహానీ ఖననం

పాలకొల్లు: జూన్ 2, )పాలకొల్లులోని లాగు దిగువన అజంతా బార్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనను గమనించిన స్థానికులు పోలీసు లకు సమాచారం అందిం చారు.పోలీసులు వెంటనే స్పందించి , మృతదేహాన్ని ఖననం చేయాల ంటూ అమ్మ ఛారిటబుల్ ఫౌండేష న్ సభ్యులని సంప్రదించారు. అయితే ఖననం కోసం తక్షణ ఏర్పాట్లు లేని నేపథ్యంలో, అధికా రుల సూచన మేరకు మృతదేహాన్ని పాలకొల్లు ఏరియా హాస్పిటల్ మార్చురీలో తాత్కాలి కంగా ఉంచారు.పాలకొల్లు యడ్లబజార్ శ్మశాన వాటికలో ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఖననం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో అంబటి పెద్ద వెంకట రాజు , నామవరపు రవికుమార్ , సిద్ధిక్, అనంతపల్లి సతీష్, అంబటి సాయితేజ తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ రహదారి కోసం భూములు ఇచ్చిన.రైతులకు 7.4 కోట్ల నష్ట పరిహారం..

### కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ...

భీమవరం మే 02 ఆకివీడు- దిగమర్రు మధ్యలో నిర్మిస్తున్న జాతీయ రహదారి 165 కు సంబంధించి భూములిచ్చిన ఆకివీడు దుంపగడప, అజ్జమూరు తదితర గ్రామాల రైతులకు 7.4 కోట్లు నష్ట పరిహారాన్ని చెల్లించినట్లు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ నాగరాణి, ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, నేహానల్ హైవేస్ ఈఈ జె సంజీవ్ రాయుడు లతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 6 ఏళ్లుగా ఆకివీడు ఉండి జాతీయ రహదారి కోసం భూములిచ్చిన రైతులకు చెల్లించాల్సిన నిధులు పెండింగ్ లో ఉన్నాయని, రైతులకు ఇవ్వాల్సిన సొమ్ములు ఇతర సమస్యలపై దృష్టి సారించి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఆర్డీవో లతో రైతులకు నష్ట పరిహారాన్ని ఇవ్వడానికి ప్రత్యేకంగా కృషి చేశామని అన్నారు. ఉన్నత అధికారులు రాకేష్ కుమార్ లతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని అన్నారు. 6, 7 ఏళ్ల కాలానికి కూడా వడ్డీ కూడా చెల్లించామని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణం రైల్వే స్టేషన్ ల అభివృద్ధి కొత్త రైల్వే సర్వీసులను అందుబాటులోకి తేవడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

# లోకేష్ కు పదోన్నతి...



కడప, జూన్ 2, లోకేష్ పదోన్నతికి సంబంధించి ప్రజలతో పాటు పార్టీ శ్రేణుల్లో చర్చకు తెరలేపారు. లోకేష్ పై ప్రజలకు ఉన్న అభిప్రాయాన్ని, సానుకూలతలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో లోకేష్ పై ఉన్న అపోహలు, అప నమ్మకాలను పోయేలా సైతం సీనియర్లు, జూనియర్లతో మద్దతుగా మాట్లాడించారు.టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ వ్యూహం పక్కా ఉంటుంది. పార్టీలో ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు దాని కోసం బలంగా చర్చ జరగాలని భావిస్తారు. ఏకాభిప్రాయానికి ఎక్కువ శాతం ప్రయత్నిస్తారు. అందుకు తగ్గట్టు సానుకూలత వచ్చిన తరువాతే నిర్ణయం తీసుకుంటారు. ఆది నుంచి అదే వ్యూహం. ఇప్పుడు లోకేష్ కు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి విషయంలో సైతం అదే ఫార్ములాను అనుసరించారు. మహానాడు వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకటన ఉంటుందని అంతా భావించారు. అనుకూల మీడియాలో సైతం దీనిపైనే పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. వ్యతిరేక మీడియాలో సైతం ఇదే హైలెట్ అయ్యింది. కానీ అందరి అంచనాలను తెరదించుతూ..మహానాడులో అటువంటి ప్రకటన రాలేదు. దీంతో పార్టీ శ్రేణుల్లో నిరాశ వ్యక్తమైంది. అయితే ఈ విషయంలో చంద్రబాబు సక్సెస్ అయ్యారు. లోకేష్ పదోన్నతికి సంబంధించి

### ఏకాభిప్రాయం సాధించిన టీడీపీ

ప్రజలతో పాటు పార్టీ శ్రేణుల్లో చర్చకు తెరలేపారు. లోకేష్ పై ప్రజలకు ఉన్న అభిప్రాయాన్ని, సానుకూలతలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో లోకేష్ పై ఉన్న అపోహలు, అప నమ్మకాలను పోయేలా సైతం సీనియర్లు, జూనియర్లతో మద్దతుగా మాట్లాడించారు.ఈసారి టీడీపీ మహానాడు అజెండా చూస్తే లోకేష్ ను ప్రాజెక్టు చేసేందుకు పక్కగా పనిచేసిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే టీడీపీ భావి నాయకుడిగా లోకేష్ ను చూపించే ప్రయత్నం గట్టిగానే జరిగింది. యనమల రామక్రిష్ణుడు లాంటి సీనియర్ నేతలు పక్కకు వెళ్లిపోయారు. కింజరాపు రామ్మోహన్ నాయుడులాంటి నేతలు క్రియాశీలకంగా కనిపించారు. మహానాడు వేదికగా జూనియర్లకు ఈసారి మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. అచ్చంగా చెప్పాలంటే లోకేష్ టీమ్ తోనే మాట్లాడించారన్న మాట. దాదాపు మాట్లాడిన వారంతా ఎన్టీఆర్, చంద్రబాబుతో పాటు లోకేష్ గురించి ప్రస్తావించారు. తద్వారా వారిద్దరి తరువాత టీడీపీ పగ్గాలు లోకేష్ కే అని తేలిపోయింది. ఈ విషయంలో చంద్రబాబు ఆలోచనకు తగ్గట్టుగానే మహానాడులో వ్యూహం ప్రకారం అంతా జరిగిపోయింది. అలా పూర్తి చేశారు కూడా.నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీని తన చేతిలో పెట్టుకున్నారు చంద్రబాబు. సగటు టీడీపీ కార్యకర్త అభిప్రాయం తెలుసు. వారి విషయంలో ఎలా వ్యవహరించాలో చంద్రబాబుకు తెలుసు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చంద్రబాబు టీడీపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఫలితాలు వచ్చిన కొద్దిరోజులకే టీడీపీలో చేరారు. కానీ 1985 మధ్యంతర ఎన్నికల్లో పోటీచేయలేదు. కేవలం టీడీపీ వ్యవహారాలు చూసుకుంటానని ఎన్టీఆర్ కు చెప్పారు. అది మొదలు సగటు టీడీపీ నాయకుడి నుంచి కార్యకర్త వరకూ అందరితో సంబంధాలు ఏర్పాటుచేసుకున్నారు. అనతికాలంలోనే పార్టీ యావత్ ను తన స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. 1995లో టీడీపీలో సంక్షోభ సమయంలో ఎన్నెన్నో ప్రశ్నలు, చిక్కుముళ్లను అధిగమించారు చంద్రబాబు. పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు, చివరికి నందమూరి కుటుంబసభ్యులు నందమూరి తారక రామారావును కాదని ..చంద్రబాబు వైపు మొగ్గుచూపారంటే పార్టీ శ్రేణుల్లో ఆయనపై అపార నమ్మకమే కారణం. అయితే దానిని వెన్నుపోటు అని..రాజకీయ దురాక్రమణ అని విశ్లేషకులు, ప్రత్యర్థులు రకరకాల పేర్లు పెట్టారు. కానీ ప్రజలు మాత్రం చంద్రబాబును ఆమోదించారు. పార్టీ శ్రేణులు మూడు దశాబ్దాల పాటు ఆయన నాయకత్వంలో పనిచేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఇప్పుడు లోకేష్ సైతం పార్టీ శ్రేణుల్లో అదే ఆత్మస్థైర్యాన్ని నింపారు. లోకేష్ క్రియాశీలకం అయిన తరువాత తెలుగుదేశం పార్టీ శ్రేణుల బాగోగులు చూసుకుంటున్నారన్న నమ్మకం కుదిరింది. దశాబ్ద కాలం కిందట ఇదే టీడీపీ శ్రేణులకు సైతం లోకేష్ పై ఎంతమాత్రం నమ్మకం లేకుండా పోయింది. కానీ పదేళ్లలో అన్నిరకాల ఇబ్బందులను అధిగమించారు లోకేష్. సీనియర్ల నుంచి కూడా అభ్యంతరాలు తొలగిపోయాయి. వారు సైతం లోకేష్ కు జైకొట్టక తప్పని పరిస్థితి. అటు చంద్రబాబు సమకాలీకులైన సీనియర్ల వారసులు సైతం లోకేష్ టీమ్ లోకి వస్తున్నారు. లోకేష్ వచ్చిన తరువాత టీడీపీ కార్యకర్తలు తలెత్తుకొని తిరుగుతున్నారని.. వారిని అన్నివిధాలా కాపాడుకోవడంలో సక్సెస్ అయ్యారని మహానాడు వేదికగా టీడీపీ నాయకులతోనే చెప్పించారు. లోకేష్ కు ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వకపోవచ్చు కానీ..భవిష్యత్ లో పార్టీ పగ్గాలు ఆయనేవనని మాత్రం స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు.

# సూపర్ స్టార్ ఫ్యామిలీపై జగన్ పార్టీ దృష్టి

గుంటూరు, జూన్ 2, వైఎస్ జగన్మోహన్ రెడ్డిపోయిన చోటే వెతుక్కుంటున్నారా? తన నుంచి దూరమైన వర్గాలను దరి చేర్చుకునే పనిలో పడ్డారా? సినీ రంగంపై ఫోకస్ పెట్టారా? వచ్చే ఎన్నికల నాటికి సినీ పరిశ్రమను తనవైపు తిప్పుకోవాలని చూస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించింది. సినీ పరిశ్రమ ఎంతగానో సంతోషించింది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ జనసేన సంపూర్ణ విజయం సాధించడంతో సినీ ప్రముఖులు సైతం అభినందనలు తెలిపారు. అయితే సినీ పరిశ్రమ అంతా కూటమికి అండగా ఉందని భావించారు. కానీ మొన్నటి థియేటర్ల బంద్ నిర్ణయం వెనుక కుట్ర ఉందని.. పవన్ హరిహర వీరమల్లు చిత్రం అడ్డుకునేందుకేనని అనుమానాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. అయితే దీని వెనుక వైసీపీ హస్తం ఉందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. దీంతో వైసీపీకి చిత్ర పరిశ్రమకు చెందిన మనుషుల మద్దతు ఉందని అర్థమవుతోంది.అల్లు అర్జున్ఎపిసోడ్ అందరికీ తెలిసిన విషయమే. పవన్ కళ్యాణ్ జనసేన కూటమిగా వెళ్లింది. టీడీపీ, బీజేపీలతో కలిసి ప్రయాణించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రత్యర్థిగా ప్రకటించింది. సరిగ్గా అటువంటి సమయంలోనే అల్లు అర్జున్ నంద్యాల వైసీపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. దీంతో కూటమికి వ్యతిరేకంగా ఆయన అభిమానులకు పిలుపునిచ్చినట్టు అయ్యింది. తద్వారా తాను కూటమికి వ్యతిరేకం అన్న సంకేతాలు ఇచ్చారు. ఎన్నికల ఫలితాల తరువాత, పుష్ప 2 విడుదల, ఆపై అల్లు అర్జున్ అరెస్టు సమయంలో సైతం వైసీపీ పూర్తిగా అల్లు అర్జున్ కు అండగా నిలిచింది. న్యాయ సహాయం అందించింది. తద్వారా అల్లు అర్జున్ రూపంలో తమకు మద్దతు ఉంటుందని ఒక అంచనాకు వచ్చింది.సూపర్ స్టార్ క్రిష్ణ విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్ ప్రత్యేకంగా స్పందించారు. ఈ రోజు క్రిష్ణ జయంతి. ప్రముఖులంతా సంతాపం తెలిపారు. తండ్రి జయంతి సందర్భంగా మహేష్ బాబు నాన్నా అంటూ ప్రేమగా పిలుచుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సైతం నివాళులర్పించారు. నటుడిగా, దర్శకుడి, నిర్మాతగా ఎన్నో విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించారు..సినీ ప్రియుల అభిమానాన్ని చూరగొన్న తెలుగు సినీ కథనాయకుడు, సాహస నిర్మాత జయంతి సందర్భంగా ఆయన సినీ రంగానికి, కళామతల్లికి అందించిన సేవలను స్మరించుకుంటూ నివాళి అర్పిస్తున్నా.. అంటూ ఏపీ సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో ఒక పోస్టు షేర్ చేశారు.అయితే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మాత్రం ఏమోషనల్ పోస్టు పెట్టారు. సినిమాల్లోనే కాదు..నిజ జీవితంలో కూడా సూపర్ స్టార్ క్రిష్ణ హీరోగా నిలిచారు.

సినిమా రంగంలో ఆజాత శత్రువుగా పేరొందిన ఆయన టాలివుడ్ లో ఎన్నో ప్రయోగాలు చేసి సక్సెస్ అయ్యారు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగుప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అల్లూరి పేరు చెబితే మన మనసులో క్రిష్ణ మెదులుతారు. రాజకీయాల్లో కూడా రాణించారు. నిర్మాతలు, కార్మికుల కష్టాల్లో నిలిచి పెద్ద మనసును చాటుకున్నారు. నాన్నకు అత్యంత ఆప్తులైన క్రిష్ణగారి జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను అంటూ సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు. అయితే అప్పుడెప్పుడో క్రిష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావుతో పాటు నివాళులర్పించిన ఫోటో షేర్ చేశారు. అయితే చాలా ఏళ్లు కిందటే జగన్ తో విభేదించి ఆదిశేషగిరిరావు టీడీపీలో చేరిపోయారు. అటు క్రిష్ణ అల్లుడు గల్లా జయదేవ్ కుటుంబమంతా టీడీపీలో ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో జగన్ పోస్టు చూస్తుంటే మాత్రం క్రిష్ణ కుటుంబానికి దగ్గరయ్యే ప్రయత్నాలు అన్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రూ.లక్ష డిమాండ్...

### 80 వేలకు కుదిరిన బేరం...

### సీఐ మధుసూదన్‌గౌడు ప్రధాన నిందితుడు..

### ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడి...

కర్నూలు,కర్నూలు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడు, హెడ్ కానిస్టేబుల్ రవి రూ.80వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేయగా సీఐ మధు సూదన్‌గౌడు తాను నేరుగా కాకుండా హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ ద్వారా బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కొత్తబస్టాండు ఎదురుగా ఉన్న నిర్మల హోటల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపిన వివరాలు.. బాధితులు బెస్త రఘు, బెస్త రవి నుంచి హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రూ.80వేలు లంచంను నేరుగా తీసుకున్నాడు. తాను సీఐ మధుసూదన్‌గౌడు సూచనల మేరకే తీసుకున్నానని చెప్పడంతో ఏసీబీ అధికారులు సీఐని కూడా అదుపులోకి తీసుకున్నారు..మైదా పిండితో మొదలైన వైరం..స్థానిక బీ.క్యాంపు చెందిన బెస్త రఘు, బెస్త రవి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఓ బేకరి నిర్వహిస్తున్నారు. వీరికి చలపతి అనే వ్యాపారి మైదాపిండి సరఫరా చేస్తుంటాడు. 2023లో మైదాపిండి సరియై?న క్వాలిటీ లేకపోవడంతో వీరి మధ్య వైరం నెలకొంది. ఆ ఏడాదే చలపతి, మరో ఇద్దరు మిత్రులు నాగేంద్రబాబు, శ్రీనివాసులుతో కలిసి బెస్త రఘుపై దాడిచేశారు. బెస్త రఘు వీరి ముగ్గురుపైన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులకు బెయిల్ ఇచ్చి పంపించేశారు. ఆ కేసు కోర్టులో ఉండగానే మైదాపిండి వ్యాపారి చలపతి న్యాయవాది కృష్ణారెడ్డి ద్వారా బెస్త రఘుపై కేసు నమోదుచేయాలని కోర్టును ఆశ్రయించాడు. కోర్టు సూచనల మేరకు 2024 జూన్ 3న బెస్త రఘుపై అప్పటి సీఐ శంకరయ్య కేసు నమోద చేశారు. తనపై దాడిచేశాడని చలపతి ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసును విచారించిన సీఐ అందులో వాస్తవాలు లేవని గుర్తించి కేసును పెండింగ్‌లో ఉంచారు..ఎంత బతిమాలినా...ఈ కేసులో తమ తప్పేమీ లేదని, తాము చిరు వ్యాపారులమని, తమ పాపకు కూడా అనారోగ్యంగా ఉందని బాధితులు బతిమాలారు. అయినా కూడా సీఐ వినలేదు. కేసును తప్పుడు కేసు అని కోర్టుకు రెఫర్ చేయాలంటే.. మీపై కేసు లేకుండా చేయాలంటే రూ.లక్ష డిమాండ్ చేశాడని బాధితులు ఆరోపించారు. ఇందుకు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ మధ్యవర్తిత్వం వహించాడు. రూ.90వేలకు బాధితులకు, సీఐకి మధ్య బేరం కుదుర్చారు. బాధితులు వారం రోజుల క్రితమే రూ.10వేలు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌కు ఇచ్చాడు. మిగతా రూ.80వేలు ఇచ్చేందుకు వారం రోజులు గడువు కోరారు. ఈ 80వేలు ఇచ్చుకోలేని స్థితిలో ఉన్న బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆదివారం సీఐకి ఫోన్‌చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్‌కు ఇవ్వాలని సూచించడంతో కొత్తబస్టాండు వద్ద నిర్మల హోటల్‌లో హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ రాగానే ఆయనకు రూ.80వేలు అప్పగించారు. అతడు ఆడబ్బులు తీసుకుని హోటల్‌లో ఉన్న క్యాష్ కౌంటర్‌లో పెట్టాడు. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. తాను సీఐ సూచనల మేరకు తీసుకున్నానని ఏసీబీ అధికారుల ముందు వాపోయాడు. సీఐ ప్రధాన నిందితుడు అని తెలుసుకున్న ఏసీబీ అధికారులు ప్రత్యేక టీం ఏల్కూరు బంగ్లా ఉన్న సీఐ ఇంటి వద్ద కాపలా కాశారు. నిర్మల హోటల్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రెడ్ హ్యాండెడ్‌గా దొరకగానే అక్కడ సీఐని అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయనను స్టేషన్‌కు తీసుకువచ్చి కూర్చోబెట్టారు. రాత్రి పొద్దుపోయేదాకా స్టేషన్‌లోకి ఎవరినీ రానీయకుండా సీఐని విచారించారు. కర్నూలు ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారిని స్టేషన్‌కు పిలిపించి ఆయన సమక్షంలో కేసు వివరాలపై విచారణ చేపట్టారు.. పుష్ప సినిమాలో మాదిరిగా ఒక్కటి తక్కువైందనే డైలాగ్‌ను గుర్తుపెట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ దానిని అక్షరాలా పాటించాడు.

# నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని సంవత్సరం జూన్ 3న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది. సైకిల్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు.ప్రపంచ సైకిల్ దినోత్సవం కోసం 2016వ సంవత్సరం నుంచి ప్రపంచ సైక్లింగ్ అలయెన్స్ (డబ్ల్యూసీఏ), ఐరోపా సైక్లిస్ట్స్ సమాఖ్య (ఈసీఎఫ్)లు ఐక్యరాజ్య సమితిని విజ్ఞప్తి చేశాయి. 2018, ఏప్రిల్ 12న న్యూయార్క్‌లో 193 దేశాలు పాల్గొన్న ఐక్యరాజ్య సమితి 72వ సాధారణ సదస్సులో ఈ తీర్మానాన్ని ఆమోదించబడింది.ప్రపంచ సైకిల్ దినోత్సవం ప్రతిపాదనను ఐక్యరాజ్య సమితికి అందించేందుకు యునైటెడ్ స్టేట్స్ కి చెందిన ప్రొఫెసర్ లెస్జెక్ సిబిల్స్కి తన సోషియాలజీ తరగతితో కలిసి ఈ దినోత్సవ ప్రచారానికి నాయకత్వం వహించాడు. తుర్కమేనిస్తాన్ దేశంతోసహా 56 దేశాలు మద్దతు ఇచ్చాయి.ఐక్యరాజ్య సమితి లోగోలోని నీలం, తెలుపు రంగులతో ప్రపంచ సైకిల్ దినోత్సవ లోగోని ఐజాక్ ఫెల్డ్ రూపొందించాడు. ప్రొఫెసర్ జాన్ ఇ. స్వాన్సన్ యానిమేషన్ చేసాడు. ఇది ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల సైకిలిస్టులను సూచిస్తుంది. టైప్ 1, టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడానికి ప్రపంచ సైకిల్ దినోత్సవం కృషిచేస్తోంది. సైక్లింగ్ కావల్సిన ఉత్తమ పద్ధతులను, సరైన మార్గాలను అవలంబించేలా సభ్య దేశాలను ప్రోత్సహిస్తోంది.రహదారి భద్రతను మెరుగుపరచడానికి, పాదచారుల భద్రతను కాపాడటానికి సైకిల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ స్వచ్ఛంద సంస్థలు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తూ సైకిల్ వాడకంపై, సైక్లింగ్ చేయడంవల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కలిగిస్తాయి. 1: బరువు తగ్గడంలో సహాయాలు: సైక్లింగ్ ఉత్తమ కార్డియో వ్యాయామం మరియు ఓర్పు అభివృద్ధికి మంచిది. ఇది హృదయ స్పందన రేటును పెంచుతుంది మరియు బరువు తగ్గడానికి సహాయపడే క్వాడ్రిస్ప్స్, హామ్ స్ట్రింగ్స్, గ్లూట్స్ వంటి కండరాల పెద్ద సమూహంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. వంపుతిరిగిన ఉపరితలంపై సైక్లింగ్ ఉదర కండరాలను లక్ష్యంగా చేసుకుంటుంది మరియు బొడ్డు కొవ్వు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. 2: గుండె ఆరోగ్యానికి మంచిది: రెగ్యులర్ సైక్లింగ్ గుండె, ఊ పిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుంది మరియు ప్రసరణ ప్రక్రియను సున్నితంగా చేస్తుంది, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. సైక్లింగ్ గుండె కండరాలను బలపరుస్తుంది, విశ్రాంతి పల్స్ తగ్గిస్తుంది మరియు రక్తంలో కొవ్వు స్థాయిలను తగ్గిస్తుంది. 3: భంగిమను మెరుగుపరుస్తుంది: సైక్లింగ్ శరీర భంగిమను మెరుగుపరచడంలో సహాయపడుతుంది, ఎందుకంటే సైక్లిస్ట్ బైక్ నిటారుగా ఉంచడానికి వారి శరీరాన్ని స్థిరీకరించాలి. ఇది వయస్సుతో తగ్గుతున్న సమతుల్యత మరియు సమన్వయంపై కూడా పనిచేస్తుంది. 4: ఒత్తిడిని తగ్గిస్తుంది: శరీరంలో కార్టిసాల్ స్థాయిని తగ్గించడంలో సైక్లింగ్ ప్రభావవంతంగా ఉంటుంది. అందువల్ల, ఈ కార్యాచరణను గొప్ప ఒత్తిడి బస్టర్‌గా పేర్కొనవచ్చు. అలా కాకుండా, సైక్లింగ్ సిరోటోనిన్ పెరుగుదలకు మద్దతు ఇస్తుంది, ఇది నిద్రను మెరుగుపరుస్తుంది. 5: తక్కువ వాయు కాలుష్యం: మంచి ఆరోగ్యానికి స్వచ్ఛమైన గాలి నాణ్యత చాలా ముఖ్యమైనది, మీరు మీ మోటారుబైక్ లేదా కారును ఉపయోగించకుండా, మీ పనికి లేదా స్థానిక కిరాణా దుకాణానికి సైక్లింగ్ చేయడం ద్వారా హరిత వాతావరణానికి దోహదం చేయవచ్చు.ప్రపంచ సైకిల్ దినోత్సవం 2021 న, సైక్లింగ్ కోసం హెల్మెట్ ధరించడం, మీ సైకిల్ కోసం వెనుక మరియు ముందు ఎల్ ఈ డి లైట్ల వాడకం వంటి భద్రతా నియమాలను తెలుసుకోవడానికి ప్రయత్నించండి.

## కళాకారులు కారణజన్ములు కళా ప్రియ తిరుపాలు 87వ జన్మదినం...



కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కళాప్రియ తిరుపాలు 87వ జన్మదినం కర్నూలు నగరం నందలి మద్దూర్ నగర్ లో గల తెలుగు తోట యందు కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది. కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుడుగా దాదాపు 40 సంవత్సరాలుగా శ్రీకృష్ణ, బిల్వ మంగళ, భవాని శంకరం, అర్జున, నారద, పాత్రను పోషించి అభినందనలు పొందిన కందుకూరి పురస్కార గ్రహీత కళాప్రియ తిరుపాలు 87వ జన్మదినం తెలుగు భాష ఉద్యమ నాయకులు జెవిఎస్ఆర్ కేశర్మ, కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ జి ఎస్ ఎం సుభాన్, లలిత కళా సమితి మాజీ అధ్యక్షులు పి దస్తగిరి, కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా,హనుమాన్, కళానమితి , అధ్యక్షులు,తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక వ్యవహారాల జిల్లా అధ్యక్షులు పెనికలపాటి హనుమంతరావ చౌదరి, ముఖ్య అతిథులుగా పాల్గొని కళాప్రియ తిరుపాలు ఘనంగా సన్మానించి, మిఠాయిలు పంచి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కర్నూలు జిల్లా రంగస్థల కళాకారులకు ఒక వేదిక జిల్లాకు అవసరం ఉందని అందుకొరకు రంగస్థలం కళాకారులు సంఘటితమై పోరాడి ప్రభుత్వం ద్వారా కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారులకు అవసరమైనటువంటి కళావేదికను పునః నిర్మించుకోవాలని సభికులు అభిప్రాయం తెలియజేశారు. నిరుపేద రంగస్థలం కళాకారులకు ఆర్థిక సహకారం అందజేశారు. కళా ప్రియా 87వ జన్మదిన కార్యక్రమంలో కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారులు సయ్యద్ రోషన్ అలీ, సిబి అజయ్ కుమార్, గోవిందరాజులు, నాగేశ్వరావు , నాగ శేషు , డాక్టర్ నగేష్ ,షేక్షావలి, సర్దార్, సిద్ధిక్ భాష,డి పార్వతయ్య, శారదమ్మ, నారాయణ,నిర్మల, ముంతాజ్ కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారులు కళాప్రియ తిరుపాలకు అభినందనలు తెలియజేశారు..

## రేషన్ డీలర్లు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

**ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ**

**పండుగ వాతావరణం లో రేషన్ పంపిణీ కార్యక్రమం**



ఆచంట : జూన్ 2, రేషన్ లబ్ధిదారుల అవస్థలు తీర్చడానికి ప్రభుత్వం ఏండియూ వ్యవస్థను రద్దుచేసి డీలర్ల వ్యవస్థ ను మళ్లీ ప్రారంభించామని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు ఆదివారం ఆచంట షాప్ నెంబర్ 42 లో ఆయన రేషన్ పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణం లో నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఏండియు వాహనాలను బియ్యం స్మగ్లింగ్ కు వాడుకున్నారని అన్నారు. రేషన్ డీలర్లు ఖచ్చితమైన తూకంతో లబ్ధిదారులకు నిత్యవసరాలు పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పితాని పిలుపునిచ్చారు. డీలర్స్ వద్ద నుంచి ప్రతి నెలా 15 వ తేదీ లోపు మీరు రేషన్ తీసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల టిడిపి అధ్యక్షుడు కేతా మీరయ్య, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాది బాలాజీ శ్రీనివాసు, పట్టణ టిడిపి అధ్యక్షుడు తమ్మినీడి పృధ్వి, పట్టణ జనసేన అధ్యక్షుడు నంబూరి విజయ్, ఎంపీటీసీ సభ్యురాలు దాసిరెడ్డి పుణ్యవతి, కేత మురళి, నెక్కంటి ప్రభాకర్ రావు, బలుసు శ్రీరామమూర్తి, మానేపల్లి రాంబాబు, నంబూరి విజయ్ కుమార్, నిమ్మన వీరశేఖర్, తహసిల్దార్ జి కనకరాజు, ఎంపీడీవో వి పూర్ణ బాబ్జి, వీఆర్వోలు సీతారాం, రాజబాబు వీర మహిళలు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 29,796 చౌక డిపోల ద్వారా సరుకులు బట్వాడా

**మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ.**

పెనుమంట్ర: జూన్ 2,రాష్ట్రంలో 29,796 చౌక డిపోల ద్వారా రేషన్ సరుకులు బట్వాడా చేస్తున్నట్లు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చెప్పారు. ఆదివారం ఉదయం పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులో చౌక డిపోను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు వృద్ధులకు నేరుగా ఇంటికే రేషన్ సరుకులు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం సాయంత్రం రెండు పూటలా సరుకులు విక్రయించడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో వీధుల్లోకి రేషన్ వాహనం వచ్చినప్పుడే సరుకులు తీసుకోవాల్సి వచ్చేదని దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్లు రూపాయలు దుబారా జరిగిందన్నారు.

# అర్జీ దారులు సంతృప్తి పొందేలా సమస్యలను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

కర్నూలు, జూన్ 02: అర్జీ దారులు సంతృప్తి పొందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు..అర్జీదారుని తో మాట్లాడి అర్జీ కి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికపుడు



చూడాలని చెప్పినప్పటికీ కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, చూడకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ తెలిపారు.. గూడూరు తహసిల్దార్ లాగిన్ లో 5, 6 రోజుల నుండి ఒక అర్జీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ లాగిన్ లో 6 రోజుల నుండి ఒక అర్జీ చూడకుండా ఉన్నాయన్నారు.. లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పెండింగ్ లో లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు...సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 13 , కర్నూలు ఆర్డీఓ వద్ద 8, పత్తికొండ ఆర్డీఓ వద్ద 8, కలెక్టరేట్ ఏఓ వద్ద 3, సర్వే ఏడి వద్ద 2, స్కిల్ డెవలప్మెంట్ అధికారి, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ వద్ద ఒక అర్జీ చొప్పున పెండింగ్ లో ఉన్నాయన్నారు.. సిఎంఓ గ్రీవెన్స్ లు పెండింగ్ ఉండకూడదని, ఎప్పటికపుడు పరిష్కారం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు...మండల స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలలో పర్యటించండిమండల స్పెషల్ అధికారులు 2 నెలల్లో మండలం లోని అన్ని గ్రామాలను పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు.. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఎఫ్ పి షాపులు, వసతి గృహాలు, ఓ హెచ్ ఆర్ ఎస్ ట్యాంక్ లు శుభ్రత, పారిశుధ్యనీ, డ్రైనేజ్ క్లీనింగ్, తదితరాలను పరిశీలించి నిర్దేశించిన ప్రొఫార్మాల్లో తనిఖీ నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ మండల స్పెషల్ అధికారులను ఆదేశించారు... వర్షాకాలం మొదలవుతున్నందున పారిశుధ్యం, నీటి ట్యాంక్ ల క్లీనింగ్, క్లోరినేషన్ ప్రక్రియలు ప్రతి గ్రామంలో జరిగే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.. గ్రామాల్లో సమస్యలు ఏమున్నా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య మాట్లాడుతూ యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగంగా మాస్టర్ ట్రైనర్ లు మండలాలలో ట్రైనింగ్ ఇచ్చిన వారిని వారి లాగిన్ లో మ్యాపింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు..

## 02-06-25 న కలెక్టరేట్ పీజిఆర్ఎస్ కు వచ్చిన ఫిర్యాదులలో కొన్ని...

కర్నూలు జిల్లా, క్రిష్ణగిరి మండలం, రామక్రిష్ణాపురం గ్రామ 10 మంది రైతులు పొగాకు ఎఅ కంపెనీ వారు పంట వేయమని చెప్పినారు. వారిమాటల తో పంట వేసినాం. బార్లీ రకం పొగాకు కొంత కంపెని వారు కొన్నారు. మిగిలిన పొగాకును కొనాలని వారిని అడిగితే కొనటం లేదని.కావున దయవుంచి మా పొగాకు పంట కొనుగోలు చేయించి మాకు తగిన న్యాయము చేయ వలసిందిగా మధు ,మారన్న,జగదీష,రాజు కలెక్టర్ ను కోరారు...×(2)కోడుమూరు నుండి కర్నూల్ వచ్చే వాహనాలు 100 అడుగుల రోడ్డు మలుపు జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా ఆ జంక్షన్లో వేగంగా వచ్చి పలు కాలనీలో నుండి వచ్చే వాహనాలను తగులుతూ ప్రమాదకర పరిస్థితులు కల్పిస్తున్నాయని కావున 100 అడుగుల రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయించ వలసిందిగా జిల్లా కలెక్టర్ కు పలు కాలనీవాసులు తరఫున రిచ్ మండ్ కాలనీ వాసులు విజ్ఞాపన పత్రం అందజేశారు...(3)దిన్నిదేవరపాడు



శ్రీ వెంకటేశ్వర గ్రూప్ నివాస సముదాయాలకు 2022 నుండి "కుడా" అప్రూవల్ లేకుండా విక్రయాలు జరపడం జరిగింది. ఆ విధంగా మమ్మల్ని లేఔట్ యజమాన్యాలు మోసగించాయని మాకు కనీస సౌకర్యాలు కలగకుండా అడ్డుపడుతున్నారని ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చర్య తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

## ప్రజా పిర్యాదుల పరిష్కర. వ్యవస్థ. కార్యక్రమం

చింతలపూడి : జూన్ 02 , చింతలపూడి తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్ ) కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, చింతలపూడి శాసనసభ్యులు సొంగ.రోషన్ కుమార్,జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వివిధ సమస్యల పరిష్కరం కోసం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్




కె.వెట్రిసెల్వి,చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్,జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న నూజివీడు సబ్ కలెక్టర్ బి. స్మరణ్ రాజ్,వివిధ శాఖల జిల్లా అధికారులు

## అభివృద్ధి, సంక్షేమం దిశగా పనిచేస్తున్నా - మంత్రి రామానాయుడు.

పాలకొల్లు: జూన్ 2,పాలకొల్లు నియోజకవర్గం లో నన్ను గెలిపించిన నా కుటుంబ సభ్యులైన ప్రజల రుణం తీర్చుకునేలా సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మలరామానాయుడు అన్నారు. పాలకొల్లు నియోజకవర్గం లో ఉల్లంపర్రు, మట్టపర్రు గ్రామాల్లో రూ 4.24 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు తానే చేశానని, మళ్లీ ఇప్పుడు చేయబోతున్నట్లు చెప్పారు. గత జగన్ ఐదేళ్ల పాలనలో రూపాయి పని నోచుకోలేదు అన్నారు. ప్రధానంగా గ్రామంలో మట్టపర్రు ఛానల్ కు కాంక్రీట్ గోడ నిర్మాణ పనులను 2.58 కోట్లతో చేపడుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ గ్రామ ప్రధాన రహదారి నిర్మాణం జరిగేందుకు మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎమ్మెల్సీ అంగర



రామ్మోహన్ జడ్పీ చైర్మన్ గంట పద్మశ్రీ ఎంపీపీ సబ్బితి సుమంగళి సర్పంచ్ దొమ్మేటి శ్రీను గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పితాని వెంకటేష్ కోడి విజయభాస్కర్ ఎల్లామిల్లి వెంకట్రావు కుక్కల సత్యనారాయణ దేవరపు దొరబాబు రాంజీ అంబేద్కర్ కేత హరికృష్ణ మైగపుల శ్రీనివాసరావు జుత్తిగ ప్రియా తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు...

## మలేరియా నివారణ మాసోత్సవం.




పోడూరు:జూన్ 2, జూన్ 1 వ తేదీ నుండి 30 వ తేదీ వరకు నిర్వహించాలని పోడూరు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డా డి. సుప్రజ తెలిపారు ఈ అవగాహన కార్యక్రమం లో మాట్లాడుతూ మలేరియా నివారణ అనేది మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పించడానికి మరియు దానిని నివారించడానికి ప్రజలను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం నిర్వహించబడే ఒక మాసోత్సవం. మలేరియా నివారణ మాసోత్సవం యొక్క లక్ష్యాలు మలేరియా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, మలేరియాను నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం, దోమలను నియంత్రించడం, మలేరియా చికిత్స కోసం అవగాహన కల్పించడం, మలేరియాపై పోరాటంలో ప్రజల భాగస్వామ్యం చేయడం మలేరియా నివారణ మాసోత్సవం లో అవగాహన కార్యక్రమాలు లో మలేరియా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామం లో ఏర్పాటుచేయడం దోమల నివారణ కార్యక్రమాలు చేపట్టడం దోమలను నియంత్రించడానికి స్ప్రేయింగ్, నీటిని శుభ్రపరచడం మొదలైన కార్యక్రమాలునిర్వహించాలని తెలిపారు. మలేరియా బారిన వారికి చికిత్స అందిస్తామని తెలిపారు మలేరియా నివారణ గురించి ప్రజలకు తెలియజేయడానికి వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని మలేరియా నివారణ మాసోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజలకు మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పించి, దానిని నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు మలేరియా వ్యాధి గురించి తెలుసుకుని, దానిని నివారించడానికి ప్రజలకు నివారణ చర్యలు చేపట్టేలా ప్రోత్సహించాలని డా సుప్రజ తెలిపారు ప్రతి వారం డ్రై డే నిర్వహించి ఇంటి పరిసర ప్రాంతాలు లో టైర్లు, పగిలిన గాజు సీసాలు, కూలర్ లు త్రాగి వదిలేసిన కొబ్బరి బొండాలు , తదితర వాటిని శుభ్రపరిచి డ్రైనేజీ నీరు నిలవకుండా చూసుకోవాలని దోమలు ఉత్పత్తి అవ్వకుండా నివారణ చర్యలు చేపట్టేలా ప్రోత్సహించాలని తెలిపారు

## దేవాదాయ శాఖ నిధులు అందని గండిగడెం పెద్ద రామాలయం.

**హిందూ దేవాలయాలను పరిరక్షించడం ప్రభుత్వం బాధ్యతే - గ్రామ పెద్ద కొరివి శేషారావ్ప.**



ఏలూరు జిల్లా జూన్ 2 ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం టి.నర్సాపురం గ్రామపంచాయతీ ల గల గండిగూడెం గ్రామంలో కొలువైయున్న పెద్ద రామాలయం ధ్వజస్తంభ ప్రతిష్ట స్తంభన చేసుకుని నిత్య పూజలు అర్చనలతో కొలువై ఉన్న రామాలయంలో నిత్య ఆరాధన జరుగుతున్నది అటువంటి గుడికి సదరు భారతీయ హిందూ ధర్మమైన దేవాదయ శాఖకు సంబంధించిన నిధులు ఎటువంటివి ధూప దీప నైవేద్య గుడికి అర్చనల నైవేద్యం ఖర్చుల నిమిత్తం ఎటువంటి నిధులు ప్రభుత్వం వారు ఇప్పటివరకు జారీ చేయలేదని గ్రామాల్లో హిందుత్వ్ని పెంపొందించేలా ప్రజలలో దైవత్వం హిందుత్వాన్ని పెంపొందించడానికి కొలువై ఉన్న శ్రీ రామాలయానికి గ్రామంలోని నిధులు ఎటువంటివి లేకపోవడం అటువంటి నిధులు లేని ప్రభుత్వ ఆలయాలకు ప్రభుత్వమే కొంతమేర నిధులను మంజూరు చేసే విధంగా మన భారతదేశంలో జరుగుతా ఉంది కానీ టీ నర్సాపురం మండలం గండిగూడెం గ్రామంలో గత 50 సంవత్సరాలుగా కొలువైయున్న రామాలయానికి నూతన నిర్మాణం గత పది సంవత్సరాలు క్రితం ప్రతిష్టించి ప్రాణ ప్రతిష్ట చేయించి ధ్వజస్తంభ ఆరోహణం చేయించడం జరిగింది. అప్పటినుంచి ధూపదీప నైవేద్యాలు గ్రామంలోని కొందరు గ్రామ పెద్ద కొరివి శేషారావు ఆధ్వర్యంలో కొంతమేర నిధులు సేకరించి రామాలయానికి ధూప దీప నైవేద్యాలు ఖర్చు నిమిత్తం చేయించడం జరుగుతుంది. అలాగే ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందుకునే రామాలయానికి పూర్తిస్థాయి ధూప దీప నైవేద్యాలు అర్చనలు వంటివి జరిగేలా చూడాలని గ్రామంలోని ప్రజలు కోరుచున్నారు ఇప్పటికైనా ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారులు పరిశీలించి గ్రామానికి సంబంధించిన హిందూ సనాతన ధర్మం ప్రజలలో పెంపొందించి హిందువులను సైతం పరమతానికి వలసలు వెళ్లే వాళ్ళని ఆధ్యాత్మిక భావనలతో హిందువులలోనే ఉండేలా హిందుత్వాన్ని కాపాడాలని ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు ఈ గండి గూడెం గ్రామంలోని పెద్ద రామాలయాన్ని పరిశీలించి ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు భావిస్తున్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com